**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 6 సంచిక: 58, పేజీలు - 08

సోమవారం, ఆగష్టు 24, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



# అధికారుల కనుసైగల్లో బిల్డర్ల దందా.?



- మున్సిపల్ అనుమతులు ఉన్న బిల్డర్లు ఎంతమంది.?
- మున్సిపల్ అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- 2 అంతస్తులకు అనుమతులు 8 అంతస్తుల వరకు నిర్మాణాలు
- కోర్టు స్టేలను అడ్డుపెట్టుకుని అక్రమ అంతస్తులు
- నాణ్యతకు తిలోదకాలు.. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి
- నాలుగు రోజుల్లో మళ్లీ అదే అక్రమ నిర్మాణాల తంతు
- స్థానిక ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల కనుసైగల్లోనే నిర్మాణాల దందా.?
- అక్రమాలను వెలుగులోకి తెస్తే రిపోర్టర్లపైనే కేసులు
- అక్రమ నిర్మాణాలపై కథనాలు రాస్తే ఎక్సటార్షన్ పేరుతో అక్రమ కేసులు



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు నిర్మాణ రంగంలో అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారే బిల్డర్లుగా నిర్మాణాలు చేసేవాళ్లు కానీ ఇప్పుడు దారినపోయే దానయ్య కూడా బిల్డర్‌గా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టడం, అనుమతించిన దానికంటే అదనపు అంతస్తులు నిర్మించడం, నిబంధనలను బేఖాతరు చేయడం నగరంలో ఈ పరిస్థితి నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ధనార్జనే ధ్యేయంగా.. నాణ్యతకు తిలోదకాలు

భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉండగా, కొందరు అక్రమ బిల్డర్లు ధనార్జనే లక్ష్యంగా, ఖర్చు తగ్గించుకునేందుకు నాసిరకం సిమెంట్, డస్ట్ కలిసిన మెటీరియల్, నాణ్యత లేని ఇసుక, ఇనుము వంటి వాటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుభవం లేని మేస్త్రీలు, కార్మికులతో పనులు చేయిస్తూ నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా వ్యవహరించడంతో భవనాలు కూలిపోతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఫలితంగా నిర్మాణంలోనే గోడలు బీటలు వారడం, స్లాబ్‌లకు సమస్యలు రావడం, కొన్నిచోట్ల నిర్మాణాలు కూలిపోవడం వంటి అనేక సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం

అక్రమ నిర్మాణాలు ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం కలిగించే అంశం మాత్రమే కాదు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిర్మాణ కార్మికులు సైతం సరైన భద్రతా చర్యలు లేకుండా పనిచేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కార్మికులు భవనాలపై నుండి పడి మరణించిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఆ నిర్మాణాలపై ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రతిసారీ అధికారులు హడావుడిగా తనిఖీలు, కూల్చివేతల ప్రకటనలు చేయడం, కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారడం విమర్శలకు తావిస్తోంది.

## "స్టే" పేరుతో అక్రమాలకు శ్రీకారం.?

కొన్ని నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన తర్వాత కోర్టులను ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకుని, వాటిని అడ్డుపెట్టుకుని నిర్మాణాలను కొనసాగించడం సర్వసాధారణంగా మారింది. ఆ కోర్టు స్టే ని తొలగించడానికి మున్సిపల్ అధికారులు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కనీసం కౌంటర్ కూడా వేయని కేసులు ఎన్నో ఉన్నాయి, దానికి కారణం అక్రమ నిర్మాణదారులతో టౌన్ ప్లానింగ్ అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కుమ్మకు కావడమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే ఎన్ని సంవత్సరాలు గడిచిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కౌంటర్ వెయ్యరు. కోర్టు ఉత్తర్వుల అసలు పరిధి, అమలు పరిస్థితులను పరిశీలించకుండా వాటిని అక్రమ నిర్మాణాలకు రక్షణ కవచంగా మార్చుకుంటే ప్రజా భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అధికారుల కనుసైగల్లోనేనా.?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా జోనల్ కమిషనర్లకు, డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదులు చేసిన ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోందో చెప్పాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖ మంత్రిపై, కమిషనర్లపై ఉంది. అక్రమ నిర్మాణాలకు ఎవరి అండదండలు ఉన్నాయో సమగ్రంగా విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రమాదం జరిగినప్పుడే మేల్కొంటారా.?

అక్రమ నిర్మాణాలు కూలిన తర్వాత, కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన తర్వాత లేదా ప్రజలు గాయపడిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే నిర్మాణ దశలోనే అక్రమాలను గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్ మెన్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపీలో ప్రాథమిక దశలోనే అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోకుండా సెటిల్మెంట్లు చేసుకుంటున్నరన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదం జరిగిన రోజున అధికారులు రంగంలోకి దిగి హంగామా చేయడం, నాలుగు రోజులు గడవకముందే అదే ప్రాంతంలో మరో అక్రమ నిర్మాణం యదేచ్ఛగా మొదలవుతుందన్న విమర్శలు ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

## అక్రమాలను ప్రశ్నిస్తే రిపోర్టర్లపైనే కేసులా.?



ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే మీడియా కథనాలను అధికారులు స్వాగతించాల్సింది పోయి, అక్రమ నిర్మాణాలపై వార్తలు రాసిన రిపోర్టర్లపైనే అక్రమ కేసులు పెట్టడం మరింత దురదృష్టకరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి, అక్రమాలపై ప్రశ్నించడం జర్నలిస్టుల బాధ్యత. నిజంగా వార్తల్లో అవాస్తవాలు ఉంటే చట్టపరమైన మార్గాల్లో సమాధానం ఇవ్వాలి తప్ప, కేసులతో గొంతు నొక్కే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని జర్నలిస్టు సంఘాలు పేర్కొంటున్నాయి. ఇటీవల అక్రమ నిర్మాణాలపై కథనాలు రాస్తున్న రిపోర్టర్ల పై ఒక పథకం ప్రకారం బిల్డర్లు ఎక్సటార్షన్ పేరుతో తప్పుడు కేసులు పెట్టడం సర్వసాధారణంగా మారింది. రిపోర్టర్ల పై ఫిర్యాదులు రావడమే ఆలస్యం క్షణాలలో ఎఫ్ఐఆర్ లు నమోదవుతున్నాయి. ఫిర్యాదులపై కనీస ప్రాథమిక విచారణ జరగకుండానే అంటే బిల్డర్ల దౌర్జన్యం, ఆర్థిక బలం ఎంత తీవ్రస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

## ఎవరి ప్రాణాలకు ఎవరు బాధ్యులు.?

ప్రభుత్వం దృష్టికి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, మీడియా కథనాలు వస్తున్న ఎలాంటి చర్యలు లేకపోతే.. రేపు ఏదైనా భారీ ప్రమాదం జరిగితే అందుకు బాధ్యత ఎవరిది.? మున్సిపల్ అధికారులదా.? స్థానిక ప్రజాప్రతినిధులదా.? ప్రాణనష్టం జరిగిన తర్వాత పరిహారాలు ప్రకటించడం కంటే ముందుగానే ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ బాధ్యత. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న మూడు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల పరిధిలో అనుమతులు, నిర్మాణ నాణ్యత, అదనపు అంతస్తులు, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతుందా.? లేక మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తుందా.? అన్నదే నగరవాసుల ప్రశ్న.

## పోలీసుల అదుపులో సాజిద్ : బిల్డర్‌గా మారిన కారు మెకానిక్



గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో 48 గజాల్లో అక్రమంగా నిర్మించిన ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతిచెందగా, బాధ్యుడైన బిల్డర్ సయ్యద్ సాజిద్‌ను రాయదర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బిల్డర్ సయ్యద్ సాజిద్‌కు సంబంధించి పలు సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సాజిద్ గతంలో తన తండ్రి వద్ద కారు మెకానిక్‌గా పనిచేసిన తర్వాత రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలోకి వచ్చినట్లు సమాచారం. గత నాలుగేళ్లుగా భూవివాదాలు, నిర్మాణాలపై దృష్టి పెట్టి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, కొందరు అధికారులు, కబ్జాదారులతో కలిసి భూములను తక్కువ ధరలకు సొంతం చేసుకుని, వాటిపై బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి విక్రయించినట్లు ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గత మూడేళ్లలో సాజిద్ ఐదు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో రెండు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అంజయ్యనగర్‌లో ప్రమాదం జరిగిన సమయంలోనే సమీపంలోని మరో భవనంలో ఆరో అంతస్తు స్లాబ్ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాజిద్ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని ఆక్రమించి అక్కడ కూడా ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతో నిర్మాణ రంగంలోకి ప్రవేశించినట్లు సమాచారం. అనంతరం సరైన ఇంజినీరింగ్ ప్రణాళికలు లేకుండానే కాంట్రాక్టులు తీసుకుని హాస్టళ్లు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారులకు లంచాలు ఇచ్చి అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు ఉన్నాయని తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి. ప్రమాదంపై పోలీసు, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, హైడ్రా అధికారులు సమన్వయంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్మాణ అనుమతులు, భవన భద్రత, నిబంధనల అమలుపై కఠిన పర్యవేక్షణ అవసరమని స్థానికులు అంటున్నారు.

# హైదరాబాద్‌కు వచ్చాక అన్ని విషయాలు మాట్లాడతా

**- లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సీఎం**
**- ఈ అంశంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ప్రత్యేక కృతజ్ఞతలు**
**- రాజకీయ కారణాలతోనే పర్యటనను అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపణ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూకే, యూఎస్ టూర్ లకు ప్లాన్ చేసుకున్నాక వీటిలో యూకే టూర్ కు అనుమతిచ్చిన కేంద్రం, యూఎస్ టూర్ కు మాత్రం అనుమతి నిరాకరించింది. దీంతో యూకే టూర్ నుంచి తిరిగి హైదరాబాద్ బయలుదేరుతున్న రేవంత్ రెడ్డి.. ఈ వ్యవహారంపై నోరు విప్పారు. యూఎస్ టూర్ లో రేవంత్ రెడ్డి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు, అలాగే న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీతో భేటీ కావాలనుకున్నారని తెలిసి, కేంద్రం అడ్డుకుందన్న ప్రచారం నేపథ్యంలో ఆయన తిరిగి వచ్చేందుకు సిద్దమవుతున్నారు.అంతకు ముందే యూకే నుంచే రేవంత్ రెడ్డి దీనిపై స్పందించారు. రేవంత్ టూర్ ను కేంద్రం అడ్డుకున్న తర్వాత అటు తెలంగాణ ప్రభుత్వం కానీ, కేంద్రం కానీ పూర్తి వివరాలు ఇవ్వలేదు. కేంద్రం రాజకీయ కారణాలతోనే రేవంత్ రెడ్డి అమెరికా టూర్ కు అనుమతి ఇవ్వలేదని ఆ తర్వాత వెల్లడించింది. రేవంత్ రెడ్డి మాత్రం దీనిపై సైలంట్ గా ఉన్నారు. కానీ ఆదివారం మాత్రం దీనిపై ట్వీట్ చేశారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో, తనకు బలమైన మద్దతునిచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ విషయంలో తనకు అండగా నిలిచిన పార్టీకి, నాయకులకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ ఎంతో కృతజ్ఞుడను అంటూ రేవంత్ ట్వీట్ లో పేర్కొన్నారు. లండన్‌లో తన సమావేశాలు, నిర్ణీత కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయని; గత మూడు రోజులుగా తనకు లభించిన అద్భుతమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రేవంత్ తెలిపారు. రాజకీయ కారణాల రీత్యా తన అమెరికా పర్యటనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించడంతో, అసలు ప్రణాళిక ప్రకారం బోస్టన్‌కు వెళ్లకుండా, కొన్ని గంటల్లోనే తిరిగి హైదరాబాద్‌కు విమానంలో బయలుదేరుతున్నానని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత ఈ అంశాలకు సంబంధించిన అన్ని విషయాల గురించి మాట్లాడతానన్నారు.

# డీలిమిటేషన్ బిల్లు కోసం పట్టువదలని కేంద్రం.?

**- ప్రోరోగ్ కాని లోక్ సభ - అక్కడే డౌట్స్.?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు. లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, ఇప్పటివరకు సమావేశాల ప్రోరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రపతి ఇంకా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇలా చేయడం వెనక కేంద్ర ప్రభుత్వ వ్యూహం ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి.పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా కావడం, 'ప్రోరోగ్' కావడం రెండూ వేర్వేరు. సభలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాన్ని ముగిస్తూ ప్రకటన జారీ చేసినప్పుడే ప్రోరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో పార్లమెంట్ సమావేశాలను పిలుస్తారు, ముగిస్తారు. సాధారణంగా ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రోరోగేషన్ జరగుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగియగా, ఏప్రిల్ 20న ప్రోరోగేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వర్షాకాల సమావేశాల విషయంలో మాత్రం పది రోజులు గడిచినా ఆ ఉత్తర్వులు జారీ కాలేదు.

### కీలక బిల్లుపై కేంద్రం వ్యూహమా.?

ఈ ఆలస్యానికి కారణం ఏంటన్న దానిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోయినా, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన చట్ట సవరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడానికి అవసరమైన రాజ్యాంగ సవరణను కేంద్రం ముందుకు తీసుకురావచ్చునే ప్రచారం జరుగుతోంది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఇప్పటికే ఆమోదం పొందింది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ అంశం కీలకంగా మారింది. బడ్జెట్ సమావేశాల సమయంలోనే దీనిపై చర్చ జరిగినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమకూరకపోవడంతో ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయిందనే ప్రచారం జరిగింది.

### దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం ఒక ప్రత్యామ్నాయ ఫార్ములాపై కసరత్తు చేస్తోందనే చర్చ సాగుతోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను సమాన ప్రాతిపదికన సుమారు 50 శాతం పెంచే ప్రతిపాదనపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. అలా చేస్తే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యం తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

### ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారా.?

స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును ముందుకు తెచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు గతంలోనే వినిపించాయి. ఇప్పుడు వర్షాకాల సమావేశాల ప్రోరోగేషన్ ఆలస్యం కావడం ఈ చర్చలకు మరింత ఊతమిస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రత్యేక సమావేశం నిర్వహణపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమీకరించి కీలక బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్ ప్రశ్నల వర్షం

సెషన్ ప్రోరోగ్ కాకపోవడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ప్రోరోగ్ ఉత్తర్వులు ఎందుకు జారీ చేయలేదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రోరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేశారు. పది రోజులు గడిచినా ఇంకా ప్రోరోగేషన్‌పై సమాచారం లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సమావేశంలో ఆమోదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవసరమైన మూడింట రెండొంతుల మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు.

అయితే గతంలోనూ ప్రోరోగేషన్ ఆలస్యమైన సందర్భాలు ఉన్నాయని జైరాం రమేశ్ స్వయంగా పేర్కొన్నారు. 2015లో వర్షాకాల సమావేశాల అనంతరం 28 రోజులు, 2021లో 20 రోజుల వ్యవధి ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. అయితే అప్పట్లో ప్రస్తుతం కనిపిస్తున్నట్లుగా ఎలాంటి రాజకీయ వ్యూహాలు లేవని ఆయన వ్యాఖ్యానించారు.

### విజయ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ

డీలిమిటేషన్ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఆగస్టు 21న మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన కారణంగా ఏ రాష్ట్రానికీ పార్లమెంట్‌లో ప్రాతినిధ్య శాతం తగ్గకుండా కేంద్రం స్పష్టమైన చట్టపరమైన హామీ ఇవ్వాలని విజయ్ కోరారు. మరోవైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీసం వచ్చే 25 ఏళ్ల పాటు సీట్ల సంఖ్యను మార్చకూడదని కేంద్రాన్ని కోరారు.ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల ప్రోరోగేషన్‌పై కేంద్రం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ఏదైనా కొత్త ఫార్ములాను ముందుకు తెస్తుందా? ప్రత్యేక సమావేశానికి తెరలేపుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# 'బ్రిక్స్' దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధం

**- బ్రిక్స్ దేశాల క్రీడాశాఖ మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)**
బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌కు సీఎం ప్రతిపాదించారు. బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు ఇచ్చిన విందులో సీఎం పాల్గొన్నారు. క్రీడలు ఆరోగ్యవంతమైన వ్యక్తులతో పాటు బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తాయన్నారు. నెల్లూరులో క్రీడా పరికరాల తయారీ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు భౌగోళికంగా, భాషా, సంస్కృతి పరంగా విభిన్నమైనప్పటికీ క్రీడలతో ఐక్యంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. బ్రిక్స్ దేశాల మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు విశాఖ కేంద్రంగా "యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్" ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాదని, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానానికి నిదర్శనమన్నారు.

### స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం

బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశాల సందర్భంగా శనివారం విశాఖలో సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారిక విందు నిర్వహించారు. ఇందులో సీఎం పాల్గొని మాట్లాడారు. క్రీడల ద్వారా అథ్లెట్లు, కోచ్‌లు, ట్రైనర్లు, ఫిజియోథెరపిస్టులు, ఈవెంట్ మేనేజర్లు, పారిశ్రామికవేత్తలకు ఎన్నో అవకాశాలు లభిస్తాయని సీఎం చెప్పారు. స్పోర్ట్స్ టూరిజం ద్వారా పెట్టుబడులు రావడంతో పాటు అంతర్జాతీయ ఈవెంట్ల ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందన్నారు. క్రీడలు ఆరోగ్యవంతమైన వ్యక్తులతో పాటు బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తాయని తెలిపారు. "ఒలింపిక్స్-2036 ప్రాజెక్టు" కింద గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వ్యవస్థను రూపొందిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రతిభావంతులకు శాస్త్రీయ శిక్షణ ద్వారా 2036 ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ క్రీడా పోటీలకు సిద్ధం చేస్తామని చెప్పారు. 56 స్పోర్ట్స్ స్కూళ్లను రాష్ట్రస్థాయి అకాడమీలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లకు అనుసంధానిస్తామని చంద్రబాబు వివరించారు.

### నెల్లూరులో క్రీడా పరికరాల తయారీ హబ్

అమరావతి కేంద్రంగా స్పోర్ట్స్ ఎకోసిస్టం అభివృద్ధి చేసి దాన్ని స్పోర్ట్స్ సిటీగా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. నెల్లూరును క్రీడా ఉపకరణాల తయారీ, అపెరల్ టెక్నాలజీ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖను అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో శిక్షణ, ఆవిష్కరణ, తయారీ అనే విధానంలో ఒక సమగ్ర విధానాన్ని రూపొందిస్తున్నట్లు బ్రిక్స్



దేశాల ప్రతినిధులకు వివరించారు. బ్రిక్స్ దేశాల్లోని ప్రపంచస్థాయి నైపుణ్యాలను కలిసి పంచుకోవడానికి ఏపీ సిద్ధంగా ఉందన్నారు.దీనిలో భాగంగా సహాయ సహకారం, శిక్షణ ఇచ్చిపుచ్చుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. క్రీడా ఉపకరణాల తయారీ, అంతర్జాతీయ ఈవెంట్లు, ఉన్నతస్థాయి శిక్షణ కేంద్రాల ఏర్పాటు, వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజంలో భాగస్వామ్యానికి ముందుకు రావాలని బ్రిక్స్ దేశాల ప్రతినిధులను సీఎం కోరారు. తొలుత బ్రిక్స్ దేశాల క్రీడా శాఖ మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు జ్ఞాపిక అందజేశారు. కేంద్ర సహాయమంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంతో చర్చలు సఫలం

**- తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ**
**- ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విజయవంతం**
**- డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూల హామీ**
**- సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించిన ఐక్య కార్యాచరణ కమిటీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మె విరమించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. అంతుకుముందు ఆటో జేఏసీ నేతలు, రవాణాశాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ వర్చువల్ గా మాట్లాడారు. బంద్ విరమించాలని ఆటో జేఏసీ నేతలను కోరారు. యూనియన్ల డిమాండ్స్ పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విజయవంతం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. అంతకుముందు ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని 'కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ' పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జేఏసీ నేతలు తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.ఇక ఇదే అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ట్వీట్ పెట్టారు. " ఆటో కార్మిక సంఘాల తో జరిగిన చర్చలు సఫలం. ఆటో కార్మిక సంఘాల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఆటో కార్మిక సంఘాల నిరవధిక బంద్ విరమించుకోవాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి స్పందించి సమ్మె విరమించిన ఆటో కార్మిక సంఘాలకు ధన్యవాదాలు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. "ఆటో కార్మిక సంఘాల కు ప్రభుత్వం నుండి సానుకూల అంశాలు ఆర్టీసీ పక్షాన ఈవి ఆటో లు కొనే ప్రసక్తే లేదు అది దుష్ప్రచారం మాత్రమే ఆర్టీసీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది విధివిధానాలకు సెప్టెంబర్ 1 వ తేదీ కార్మిక శాఖ ‌ రవాణా శాఖ ‌ ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం జరగనుంది. 2012 తర్వాత ఆటో చార్జీలు పెంచలేదు కాబట్టి ఆటో చార్జీలు పెంచడానికి అంగీకరిస్తూ ఎంత పెంచాలి అనే దానిపై తగిన నివేదిక తీసుకొని సంబంధిత జీవో విడుదల చేయడానికి అంగీకారం. ఓలా, ఉబెర్ లా మాదిరి ప్రభుత్వం తరుపున యాప్ చేయాలని నిర్ణయం ప్రభుత్వం ఐటీ శాఖ నుండి యాప్ ప్రారంభించేందుకు తగిన ప్రక్రియ ప్రారంభిస్తాం ద్విచక్ర వాహనాల్లో రాపిడో,ఓలా ఉబెర్ నడిపే వాటికి ఎల్లో ప్లేట్ ఉన్న వాటికి మాత్రమే ప్రయాణికులను తరలింపు పై నిర్ణయం తీసుకుంటాం" అని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు."గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు 12 వేల రూపాయల అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తగిన అంశాలు పరిగణన లోకి తీసుకొని ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి, సహచ మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం. హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో పాత డీజిల్ , పెట్రోల్ ఆటో లకు రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటో లుగా మార్చడానికి 1.50 లక్షలు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. కొత్త ఆటో లు కొనుగోలు చేయడానికి సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. హైదరాబాద్ లో కాలుష్యాన్ని తగ్గించడానికి పర్యావరణాన్ని కాపాడడానికి నగరంలో ఈవి ఆటో లుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆటో కార్మికుల సోదరులు వారి డిమాండ్స్ పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉంది.. అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# దేశంలో చదువు, ఉద్యోగం, శిక్షణా లేని యువత 8.7 కోట్ల మంది

**- 15-29 ఏళ్ల వారిపై నీతి ఆయోగ్ తీవ్ర ఆందోళన**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో యువతకు సంబంధించి ఆందోళన కలిగించే విషయాలను నీతి ఆయోగ్ తాజా నివేదిక వెల్లడించింది. 15 ఏళ్ల దగ్గరి నుంచి 29 ఏళ్ల మధ్య వయసు ఉన్న 8.7 కోట్ల మందికి పైగా యువత చదువుకోవడం ఉద్యోగం చేయడం లేదా నైపుణ్య శిక్షణ పొందడం లేదు. వీరిని 'నీట్ యూత్'గా నీతి ఆయోగ్ నిర్వచించింది. 'రిమైనింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్‌ఏ2047' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలను నీతి అయోగ్ ప్రస్తావించింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలోని 15-29 ఏళ్ల యువతలో పెద్ద సంఖ్యలో చదువు, ఉపాధి, శిక్షణకు దూరంగా ఉన్నారని తేలింది. 2021లో నిర్వహించిన 78వ జాతీయ శాంపిల్ సర్వే డేటా ఆధారంగా ఈ అంచనాలను రూపొందించారు. యువతకు తగిన నైపుణ్యాలు అందించకపోతే భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మరింత సవాలుగా మారే అవకాశం ఉందని నివేదిక సూచించింది. మరీ ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇప్పటికే కాలేజీల ఫీజులు, ప్రైవేట్ ట్యూషన్ల వంటి ఖర్చులతో ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని నీతి ఆయోగ్ పేర్కొంది.సంప్రదాయ డిగ్రీ చదువుతో పాటు అదనంగా ఖరీదైన స్కిల్లింగ్ కోర్సులు చేయడం చాలామందికి సాధ్యం కావడం లేదని తెలిపింది. డిగ్రీ పూర్తయిన తర్వాత కుటుంబాన్ని పోషించేందుకు కొందరు తక్కువ వేతనం వచ్చినా ఉద్యోగాల్లో చేరుతున్నారని.. మరికొందరు ఉద్యోగంలోకి మారలేక నీట్ యువతగా మిగిలిపోతున్నారని నీతి ఆయోగ్ రిపోర్ట్ విశ్లేషించింది. చదువు పూర్తిచేసిన యువతలోనూ ఉద్యోగ అవకాశాల విషయంలో పరిస్థితి ఆశాజనకంగా లేదని నీతి ఆయోగ్ వెల్లడించింది. కేవలం 8.25 శాతం గ్రాడ్యుయేట్లకు మాత్రమే వారి విద్యార్హతలకు అనుగుణమైన ఉద్యోగాలు లభిస్తున్నాయని పేర్కొంది. ప్రాక్టికల్ లెర్నింగ్‌కు తగిన ప్రాధాన్యం లేకపోవడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో విద్య అనుసంధానం కాకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొంది. నీట్ యువతతో పాటు మహిళలకు కూడా తక్కువ ఖర్చుతో లేదా సబ్సిడీతో నైపుణ్య శిక్షణ అందించాలని నీతి ఆయోగ్ సూచించింది. అవసరమైన చోట ఆర్థిక సహాయాన్ని కూడా అందించాలని పేర్కొంది.
చదువుతో పాటు సంపాదించే అవకాశం కల్పించే విధానాలు యువతకు ఎంతో ఉపయోగపడతాయని నీతి ఆయోగ్ హితవు పలికింది. కార్మికులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు మధ్య కెరీర్‌లో కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశాలు కల్పించాలని సూచించింది. స్థానికంగా డిమాండ్ ఉన్న రంగాలు, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, స్వయం ఉపాధి అవకాశాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే ప్రజలకు నేర్చుకునే, సంపాదించే, నిరంతరం ఎదిగే అవకాశాలు ఉండాలని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. 2014-15 నుంచి ఇప్పటివరకు 7.67 కోట్ల మందికి పైగా శిక్షణ అందించినట్లు నివేదిక పేర్కొంది. దేశంలోని వర్క్‌ఫోర్స్, లెర్నర్స్‌ను పాఠశాల విద్య, ఉన్నత విద్య, సంఘటిత-అసంఘటిత రంగాల్లో పని, నీట్ యువత, మహిళలు అనే 5 ప్రధాన విభాగాలుగా నీతి ఆయోగ్ విశ్లేషించింది. యువతలో నైపుణ్యాలను పెంచడం, విద్యను ఉపాధితో అనుసంధానం చేయడం ద్వారా మాత్రమే ఈ సవాలును అధిగమించగలమని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసింది.

# మహిళను చంపి.. బిర్యానీ వండి

## - సినిమాను మించిన ట్విస్టులు బాబోయ్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆగ్రా రైల్వే స్టేషన్ లో లభ్యమైన సూట్ కేసులో మహిళ మృతదేహం కేసులో దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. చెన్నై నుంచి ఢిల్లీ వెళ్తున్న రైలులో లభించిన ఆ సూట్ కేసులో మహిళ శరీర భాగాలు బయటపడిన కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు దాదాపు 350 కు పైగా సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టారు. పదుల సంఖ్యలో అనుమానితులను విచారించారు. చివరికి నిందితుల ఇంటిని కనుగొన్నారు. అయితే విచారణలో భాగంగా ఆ ఇంటికి వెళ్లి చూడగా అక్కడ కనిపించిన దృశ్యాలు చూసి పోలీసులే షాక్ అయ్యారు. మహిళ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కోసి చిందరవందరగా పడేశారు. అనుమానం రాకుండా కొన్ని శరీర భాగాలతో బిర్యానీ చేశారు. ఈ దృశ్యాలను చూసి పోలీసులు విస్మయానికి గురయ్యారు.

### ఏం జరిగిందంటే..?

ఆగస్టు 5న చెన్నై నుంచి ఢిల్లీకి తమిళనాడు ఎక్స్ ప్రెస్ రైలు బయలుదేరింది. అలా ఉత్తర్ ప్రదేశ్ లోని ఆగ్రా రైల్వేస్టేషన్ కు చేరుకుంది. అయితే జనరల్ బోగీలో ఉన్న ఓ సూట్ కేస్ నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సూట్ కేసును దించి పరిశీలించగా అందులో మహిళ మృతదేహానికి సంబంధించిన శరీర భాగాలు ఉండటం చూసి ఒక్కసారిగా కంగుతిన్నారు. వెంటనే దర్యాప్తు మొదలుపెట్టారు. దర్యాప్తులో ఆ సూట్ కేస్ చెన్నై నుంచే రైలులో పెట్టినట్లు గుర్తించారు. దీంతో ఆగ్రా పోలీసులు తమిళనాడు పోలీసులను సంప్రదించారు.దాదాపు 350 కు పైగా సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించారు. ఓ పురుషుడు, ఓ మహిళ కలిసి సూట్ కేస్ తో స్టేషన్ కు వచ్చినట్లు గుర్తించారు. అలా తమిళనాడు ఎక్స్ ప్రెస్ లో సూట్‌కేసు ఉంచి చెన్నై పార్క్ రైల్వేస్టేషన్ నుంచి సబర్బన్ రైలు ఎక్కి గూడువాంజేరి చేరుకున్నట్లు సీసీటీవీల ద్వారా గుర్తించారు. అదే వ్యక్తులు సూట్ కేస్ తో ఓ ఆటోలో వెళ్తున్న దృశ్యాలను గుర్తించి చివరికి వాళ్లు నివసిస్తున్న ఇంటికి చేరుకున్నారు. ఇక అక్కడే హత్య జరిగినట్లు కీలక ఆధారాలు లభ్యం అయ్యాయి. బిర్యానీ పాత్రలో మానవ శరీరానికి సంబంధించిన ముక్కలు చూసి పోలీసులు షాక్ అయ్యారు.ఇక హత్యకు గురైన మహిళ శరీరాన్ని ముక్కలుగా చేసిన తర్వాత కొన్ని భాగాలను సూట్ కేస్ లో పెట్టి రైలులో తరలించారు. మిగిలిన భాగాలను వండుతూ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి తల మాత్రం ఇంకా లభించలేదు. దాని కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇక మృతురాలు ఒడిశాకు చెందిన హయాత్ నిషాగా గుర్తించారు. ఆమె భర్త నుంచి విడిపోయి ప్రస్తుతం చెన్నైలో ఉంటోంది. అక్కడ నిషాతో మాణిక్ ఉత్తిన్ లస్కర్, అతని భార్య భాగమతి మాజిక్ నివసిస్తున్నట్లు దర్యాప్తులో పోలీసులు తేల్చారు. నిషాకు బంధువులైన వాళ్లిద్దరే ఆమెను హత్య చేశారని తమ దర్యాప్తులో పోలీసులు తేల్చారు.

# అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'

## - శత్రు క్షిపణులకు సెకన్లలోనే చెక్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ రంగం సరికొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెడుతోంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించే క్షిపణులను సెకన్ల వ్యవధిలోనే గుర్తించి, వాటిని గగనతలంలోనే ధ్వంసం చేసేందుకు వీలుగా అంతరిక్ష ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను (స్పేస్-బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ ఎర్లీ-వార్నింగ్) భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోంది. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. 'అంతరిక్షంలో కళ్లు' (ఐస్ ఇన్ స్పేస్)గా పిలుస్తున్న ఈ వ్యవస్థ ద్వారా క్షిపణి ప్రయోగ సమయంలో దాని ఇంజిన్ల నుంచి వెలువడే అత్యధిక వేడిని (ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్) ఉపగ్రహాలు తక్షణమే పసిగడతాయి. దీంతో క్షిపణిని దాని ప్రయాణ మార్గంలోనే అడ్డగించి, నాశనం చేయడానికి భారత రక్షణ దళాలకు అమూల్యమైన సమయం లభిస్తుంది.గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఈ కొత్త వ్యవస్థ ఆవశ్యకతను స్పష్టం చేసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన ఒక హై-స్పీడ్ క్షిపణి ఢిల్లీ వైపు దూసుకొస్తుండగా, హర్యానాలోని సిర్సా వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ దానిని అడ్డగించింది. అయితే, క్షిపణి లక్ష్యాన్ని చేరడానికి కేవలం ఒకటి, రెండు నిమిషాల సమయం మాత్రమే ఉండగా ఈ అడ్డగింత సాధ్యమైంది. భూమిపై ఉన్న రాడార్లు భూమి వక్రత కారణంగా ఒక పరిమితి మేరకే పనిచేస్తాయి. దీంతో ముప్పును గుర్తించడానికి తక్కువ సమయం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, శత్రువు దాడిని ముందుగానే పసిగట్టడమే అంతరిక్ష ఆధారిత సెన్సార్ల ప్రధాన లక్ష్యం.

### వ్యవస్థ పనిచేసే విధానం

బాలిస్టిక్ క్షిపణులు ప్రధానంగా మూడు దశల్లో ప్రయాణిస్తాయి. మొదటిది 'బూస్ట్' దశ. ఈ సమయంలో ఇంజిన్లు మండి, తీవ్రమైన వేడిని విడుదల చేస్తాయి. అంతరిక్షంలోని ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఈ వేడిని ప్రయోగించిన సెకన్ల వ్యవధిలోనే గుర్తిస్తాయి. రెండోది 'మిడ్‌కోర్స్' దశ. ఈ దశలో క్షిపణి వాతావరణం బయట ప్రయాణిస్తుంది. మూడోది 'టెర్మినల్' దశ. ఈ దశలో క్షిపణి అత్యంత వేగంతో (మాక్ 15కు పైగా) లక్ష్యం వైపు దూసుకొస్తుంది.భూస్థిత రాడార్లు కేవలం టెర్మినల్ దశలోనే క్షిపణిని గుర్తించగలవు. కానీ అంతరిక్షంలోని ఉపగ్రహాలు బూస్ట్ దశలోనే గుర్తించి హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల 'కిల్ చైన్' (గుర్తించడం, ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడం) ప్రక్రియ చాలా ముందుగా ప్రారంభమవుతుంది. దీంతో వాతావరణం లోపల, వెలుపల కూడా క్షిపణిని కూల్చివేసేందుకు అవకాశం లభిస్తుంది. డీఆర్‌డీఓ ఇప్పటికే ఇటువంటి క్షిపణి విధ్వంసక పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది.

### ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం

ఈ అత్యాధునిక వ్యవస్థ రూపకల్పనలో భారత ప్రభుత్వం, ప్రైవేట్ స్టార్టప్‌లు కలిసి పనిచేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన 'దిగంతర' స్టార్టప్ 'ఆల్బట్రాస్' ఉపగ్రహాలతో బూస్ట్ దశలోనే క్షిపణులను గుర్తించే సాంకేతికతపై పనిచేస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన 'శాట్‌లియో ల్యాబ్స్' 15 ఉపగ్రహాలతో కూడిన థర్మల్ అబ్జర్వేషన్ వ్యవస్థను నిర్మిస్తోంది. ఇవి క్షిపణి ప్రయోగం వంటి అత్యధిక ఉష్ణోగ్రత ఘటనలను గుర్తించి, రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తాయి. ఈ ప్రైవేట్ ప్రయత్నాలకు తోడుగా, కేంద్ర భద్రతా కేబినెట్ కమిటీ (సీసీఎస్) 'స్పేస్-బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్-3' (ఎస్‌బీఎస్-3) అనే భారీ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. సుమారు రూ.27,000 కోట్ల వ్యయంతో 2029 నాటికి 52 ఉపగ్రహాల (21 ఇస్రో, 31 ప్రైవేట్) సమూహాన్ని అంతరిక్షంలో మోహరించనున్నారు. ఈ నెట్‌వర్క్ నిరంతర నిఘా, శత్రువుల మొబైల్ లాంచర్ల ట్రాకింగ్, కమ్యూనికేషన్స్ వంటి బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఈ బహుళ అంచెల రక్షణ వ్యూహం ద్వారా శత్రువు ఆకస్మిక దాడులు చేసే అవకాశాలను తగ్గించి, భారత రక్షణ సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# గుడి బాటకు.. రహదారి బాట

**-ఆధ్యాత్మిక క్షేత్రాలకు కొత్త దారులు**

**- 100కుపైగా ఆలయాలకు రహదారి అనుసంధానం..**

**రూ.120 కోట్లతో 205 కి.మీ. పనులు**

**- 26 రోడ్లు పూర్తి.. మరో 40 శాతం పనులు సగం దశలో**

**భక్తుల ఇబ్బందులకు చెల్లుచీటి..**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పంతో 'గుడి బాట'కు వేగం**



అమరావతి(ప్రశ్న న్యూస్) కొండలు.. ఘాట్ మార్గాలు.. మారుమూల గ్రామాలు.. దట్టమైన ప్రాంతాలు.. రహదారి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న పుణ్యక్షేత్రాలకు ఇక దారి సుగమం కానుంది. దేవుడి దర్శనానికి వెళ్లే దారినే అభివృద్ధికి తొలి మెట్టుగా భావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'గుడి



Tummari Kunta PTM Mandal
BT Road from T.Sadum Road to Malleswara swamy Temple, Total Cost 1.27 crores
Tourism Road Length of 1.2 kms| Grant : MGNREGS

బాట'కు పంచాయతీరాజ్ శాఖ ద్వారా వేగం పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 100కుపైగా ప్రధాన ఆలయాలు, పుణ్యక్షేత్రాలను గ్రామీణ రహదారులతో అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టారు.సుమారు రూ.120 కోట్ల వ్యయంతో 205 కిలోమీటర్ల మేర ఆలయ అనుసంధాన రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 26 రోడ్ల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉండగా.. మరో 40 శాతం రహదారుల పనులు సుమారు 50 శాతం మేర పూర్తయ్యాయి. భక్తులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడంతో పాటు.. ఆలయాల చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి కూడా ఈ రహదారులు దోహదపడనున్నాయి.

### భక్తుల ఇబ్బందులు చూసి..

గ్రామీణ ప్రాంతాల్లోని అనేక ఆలయాలకు సరైన రహదారి సౌకర్యం లేక భక్తులు పడుతున్న ఇబ్బందులు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చాయి. క్షేత్రస్థాయి పర్యటనల్లో స్వయంగా పరిశీలించడంతో పాటు.. ప్రజలు వినతిపత్రాల ద్వారా తెలిపిన సమస్యలను పరిగణనలోకి తీసుకున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతున్నా.. ఆలయాలకు వెళ్లే రహదారులు మాత్రం అధ్వానంగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించారు. "దేవుడి దర్శనానికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడం భక్తులకు ఇబ్బందికరం. ఆ పరిస్థితి మారాలి" అన్న సంకల్పంతో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఆలయ అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు.

### 205 కి.మీ.కు కొత్త రూపం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీబీ-జీ రామ్-జీ, సాస్కీ తదితర నిధులను వినియోగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో బడి, గుడి, ఆసుపత్రి, పంట పొలాలకు వెళ్లే మార్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

అందులో భాగంగానే ప్రధాన ఆలయాలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. కేవలం భక్తుల రాకపోకలకే కాకుండా.. ఆయా గ్రామాల ప్రజలకు కూడా ఈ రోడ్లు శాశ్వతంగా ఉపయోగపడేలా నిర్మాణం చేపడుతున్నారు.

### 26 రోడ్లు సిద్ధం

రూ.120 కోట్లతో చేపట్టిన ఆలయ అనుసంధాన రహదారుల్లో 26 రోడ్ల నిర్మాణం పూర్తయింది. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మరో 40 శాతం రహదారుల పనులు సుమారు 50 శాతం మేర పూర్తయ్యాయి. ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోని ఆలయాలకు కూడా రహదారి సౌకర్యం కల్పించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలుస్తోంది.

### అంతర్వేది.. అహోబిలానికి బాట



ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ క్షేత్రం అంతర్వేది, అహోబిలం వంటి పుణ్యక్షేత్రాలకు రహదారి అనుసంధాన పనులు పూర్తయ్యాయి.అదేవిధంగా మదనపల్లి నియోజకవర్గంలోని శ్రీ గట్టు వెంకటరమణ స్వామి ఆలయం, దేవరాయ నల్లగంగమ్మ ఆలయం, మద్రిపూడి సమీపంలోని పుడియగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు పనులు పూర్తయ్యాయి.సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం, తలుపులమ్మలోవ మార్గం, ఐ.ఎస్. జగన్నాథపురం ఘాట్ రోడ్ల నిర్మాణం కూడా పూర్తయింది.ఈ రహదారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### వాడపల్లి కరకట్టకు కొత్త రూపు

సాస్కీ నిధులతో చేపట్టిన కోనసీమ తిరుమల వాడపల్లి కరకట్ట మార్గం పనులు పురోగతిలో ఉన్నాయి. వాడపల్లి క్షేత్రానికి రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రహదారి సౌకర్యం మెరుగుపడితే యాత్రికులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. అదేవిధంగా అర్ధగిరి శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి రూ.3 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టారు.

### జాతరలకు.. క్షేత్రాలకు.. రహదారులే ఆధారం

తెనాలి, రాయచోటి తదితర నియోజకవర్గాల్లోని ఆలయాలకు వెళ్లే రహదారుల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నిడదవోలులో ఆంజనేయస్వామి ఆలయ రోడ్డు, పూతలపట్టు నియోజకవర్గంలోని తోటవారిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయ రహదారి తదితర పనులు పురోగతిలో ఉన్నాయి. ఆలయాలకు మాత్రమే కాకుండా జాతరలు, ఉత్సవాల సమయంలో వేలాది మంది భక్తులు చేరే ప్రాంతాలకు కూడా రహదారి సౌకర్యం మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నారు.

### సత్యసాయి జిల్లాకు 72 కి.మీ.

శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆ జిల్లాలో పుట్టపర్తి అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. రూ.30 కోట్లు కేటాయించింది.అదేవిధంగా శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించిన దాదాపు 72 కిలోమీటర్ల రోడ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.శత జయంతి ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రాముఖ్యత సంతరించుకుంది.

### రోడ్డు బలంగా ఉండాలి.. భక్తుల ప్రయాణం సురక్షితంగా సాగాలి

ఆలయాలకు వెళ్లే రోడ్లు నిర్మించామా.. ప్రారంభించామా.. అన్నదానికంటే వాటి నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు.భక్తులు ఏళ్ల తరబడి ఉపయోగించుకునేలా రహదారులు నిర్మించాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.నిర్మాణం పూర్తయిన ఆలయాల రహదారుల నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి.. భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### దారి వస్తే.. అభివృద్ధి వస్తుంది

ఆలయానికి రహదారి నిర్మిస్తే కేవలం భక్తుల ప్రయాణమే సులభం కాదు. ఆ మార్గంలో ఉన్న గ్రామాలకు కూడా కొత్త



అవకాశాలు వస్తాయి. స్థానికంగా వ్యాపారాలు పెరుగుతాయి. రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్లకు చేరుకోవడం సులభమవుతుంది. అందుకే 'గుడి బాట' రోడ్డు అంటే కేవలం భక్తుల బాట కాదు.. గ్రామీణ అభివృద్ధికి బాట అన్న భావనతో పనులు కొనసాగుతున్నాయి.

### ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం

ప్రసిద్ధ ఆలయాలు, కొండ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలు, ఘాట్ మార్గాల్లో ఉన్న దేవాలయాలకు రహదారి సౌకర్యం మెరుగుపడితే రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

భక్తులు ఒకే పర్యటనలో పలు క్షేత్రాలను సందర్శించే పరిస్థితులు ఏర్పడతాయి. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంటుంది.

### మరిన్ని క్షేత్రాలకు బాటలు

ఇప్పటికే చేపట్టిన పనులతో పాటు రాష్ట్రంలోని మరిన్ని ఆలయాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.గుడి కనిపిస్తోంది.. కానీ దారి కనిపించదు అనే పరిస్థితి ఇక ఉండకూడదన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

### 'గుడి బాట'.. అభివృద్ధి బాట!

కొండల్లో ఉన్నా.. మారుమూలన ఉన్నా.. గ్రామీణ ప్రాంతంలో ఉన్నా.. పుణ్యక్షేత్రానికి భక్తుడు సులభంగా చేరుకునేలా రహదారి ఉండాలి. అదే లక్ష్యంతో 100కుపైగా ప్రధాన క్షేత్రాలకు 205 కిలోమీటర్ల రహదారి అనుసంధానం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**రూ.120 కోట్ల పనులు..**
**26 రోడ్లు పూర్తి..**
**మరో 40 శాతం పనులు సగం దశలో..**
**సత్యసాయి జిల్లాలో 72 కి.మీ. పనులు..**
**పుట్టపర్తి రోడ్లకు రూ.30 కోట్లు..**

ఇలా ఆధ్యాత్మిక క్షేత్రాలకు రహదారి సౌకర్యం కల్పించే ప్రక్రియ వేగం పుంజుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పించిన ఈ 'గుడి బాట' పూర్తయితే భక్తుల ప్రయాణమే కాదు.. ఆయా ప్రాంతాల గ్రామీణ ప్రగతికీ కొత్త బాటలు పడనున్నాయి.

# బహిరంగ విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు

## - టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి బహిరంగ విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలో ఏవైనా సమస్యలు లేదా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గత కమిటీల వేదికగా చర్చించుకోవాలని సూచించారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లవచ్చని, కానీ పార్టీ లైన్ దాటి రోడ్డెక్కడం సరికాదని స్పష్టం చేశారు. ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీ పరిశీలన అనంతరం మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో తగిన నిర్ణయం ఉంటుందని తెలిపారు. తమది బీఆర్ఎస్, బీజేపీలాగ నియంతృత్వ పార్టీ కాదని, మాట్లాడటానికి ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఉన్నప్పటికీ పరిమితులు దాటితే సహించేది లేదని పేర్కొన్నారు.మరోవైపు మంత్రి కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని రవాణా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. పార్టీ ప్రయోజనాల కంటే ఏ వ్యక్తి కూడా ఎక్కువ కాదని, సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యల వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్గత విషయాలు రచ్చకెక్కడం వల్ల ప్రతిపక్షాలకు అనవసరమైన ఆయుధాలు ఇచ్చినట్లవుతోందని తెలిపారు. గతంలో చిన్నారెడ్డికి కూడా పార్టీ నోటీసులు ఇచ్చిందని గుర్తు చేస్తూ, క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై పార్టీ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.

# పంటి నొప్పి ఆ భయంకర వ్యాధికి సంకేతమా..?



కొంతమందికి సడెన్‌గా పంటి నొప్పి వస్తుంది. అది ఎందుకు వచ్చిందో అర్థం కాదు. మీకు కూడా అకస్మాత్తుగా దంతాలలో తీవ్రమైన నొప్పి వస్తే లేదా చిగుళ్ళు వాచిపోతే, లైట్ తీసుకోకండి. సకాలంలో గుర్తిస్తే పెద్ద ప్రమాదాన్ని నివారించవచ్చు. ఈ నొప్పికి కారణం ఏంటీ..? కొన్నిసార్లు దంతాలలో అకస్మాత్తుగా పదునైన నొప్పి వస్తుంది. సడెన్‌గా ఎందుకు వచ్చిందో మనకు అర్థం కాదు. చాలా సార్లు నొప్పి చల్లని లేదా తీపి ఆహారం తినడం వల్ల వచ్చిందేమో అనుకుంటాం. కానీ ఈ నొప్పి కూడా ఏదైనా తీవ్రమైన వ్యాధికి సంకేతం కావచ్చు. ముఖ్యంగా నొప్పి పదేపదే వచ్చి, మందులు తీసుకున్న తర్వాత కూడా కొంత సమయం తగ్గకపోతే దీనిని లైట్ తీసుకోవద్దు. నిజానికి, మనం పంటి నొప్పిని చాలా తేలికగా తీసుకుంటాము. కానీ ఇది శరీరంలోని అనేక రకాల సమస్యలను సూచిస్తుంది. పంటి నొప్పికి అత్యంత సాధారణ కారణం దంతాలను సరిగ్గా శుభ్రం చేయకపోవడం. మనం తీపి, జిగట లేదా ఆమ్ల పదార్థాలు తిన్నప్పుడల్లా దంతాలను సరిగ్గా శుభ్రం చేయకపోతే దంతాలు కుళ్ళిపోతాయి. దంత క్షయం ప్రారంభమవుతుంది. ఈ దంత క్షయం దంతాల పై పొరను బోలుగా చేస్తుంది. దీని కారణంగా దంత క్షయం దంతాల నరాలకు చేరి.. నొప్పిని కలిగిస్తుంది. చిగుళ్లలో వాపు ఉన్నప్పుడు, దంతాల పట్టును సడలించడం ప్రారంభమవుతుంది. దీని కారణంగా దంతాలు షివర్ అవుతుంటాయి. చాలా సార్లు, వాపుతో పాటు, చిగుళ్లలో చీము కూడా ఏర్పడుతుంది. చిగుళ్ల వాపు కూడా పంటి నొప్పికి ఒక సాధారణ సమస్య. మూడవ కారణం సరైన టూత్ బ్రష్‌ను ఉపయోగించకపోవడం. గట్టి ముళ్ళతో కూడిన బ్రష్‌తో దంతాలను శుభ్రం చేయడం, బ్రష్ చేసేటప్పుడు ఎక్కువ శక్తిని ప్రయోగించడం, దంతాలలో పగుళ్లు లేదా పదే పదే దంతాలను గ్రైండింగ్ చేసే అలవాటు వంటివి పంటి నొప్పికి కారణమవుతాయి.

# శ్రావణ మాసం విశిష్టత..

# శివకేశవుల అనుగ్రహానికి పవిత్రమైన మాసం

## శ్రావణ మాసం సందర్భం గా ప్రత్యేక కథనం

(తోట వెంకట్ - ప్రజాప్రశ్న ఆంధ్ర ప్రదేశ్ బ్యూరో )



శ్రావణ మాసం అంటేనే భక్తి, ఆధ్యాత్మికత, పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, పండుగలతో కళకళలాడే పవిత్ర కాలం. తెలుగు పంచాంగంలో శ్రావణ మాసానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. వర్షాకాలంలో ప్రకృతి పచ్చదనంతో పరవశిస్తుంటే, మరోవైపు ఆలయాలు భక్తుల సందడితో నిండిపోతాయి. ముఖ్యంగా శివారాధనకు, విష్ణు ఆరాధనకు, అమ్మవారి పూజలకు శ్రావణ మాసం అత్యంత విశిష్టమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు, దానధర్మాలు, సత్కార్యాలు విశేషమైన పుణ్యఫలాన్ని అందిస్తాయని పురాణాలు, ఆచార సంప్రదాయాలు చెబుతున్నాయి.

హిందూ చాంద్రమాన పద్ధతిలో వచ్చే శ్రావణ మాసం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యత కలిగినది. సాధారణంగా జూలై––ఆగస్టు మధ్య ఈ మాసం వస్తుంది. వర్షాకాలంలో వచ్చే ఈ మాసం ప్రకృతిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. పొలాలు పచ్చగా మారడం, చెట్లు చిగురించడం, చెరువులు, కాలువలు నీటితో కళకళలాడటం వంటి ప్రకృతి మార్పులు కూడా శ్రావణ మాసానికి ప్రత్యేక అందాన్ని తీసుకొస్తాయి. ప్రకృతిలోని ఈ మార్పును భారతీయ సంస్కృతి ఆధ్యాత్మిక భావనతో అనుసంధానించింది.

### శ్రావణం అంటే పవిత్రతకు ప్రతీక

'శ్రావణ' అనే పేరు వినగానే భక్తుల మనసులో శివుడు, అమ్మవారు, వ్రతాలు, పూజలు, మంగళకరమైన కార్యక్రమాలు గుర్తుకొస్తాయి. ఈ మాసంలో తెల్లవారుజామునే నిద్రలేచి ఇళ్లను శుభ్రం చేసుకుని, పూజా మందిరాన్ని అలంకరించి, దేవతలను పూజించడం అనేక కుటుంబాల్లో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం.శ్రావణ మాసంలో సోమవారాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజుగా భావిస్తారు. అందుకే శ్రావణ సోమవారాల్లో భక్తులు ఉపవాసాలు పాటిస్తూ శివాలయాలను దర్శించుకుంటారు. శివలింగానికి అభిషేకాలు నిర్వహించి బిల్వదళాలు సమర్పిస్తారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు వంటి పదార్థాలతో అభిషేకాలు చేయడం అనేక ప్రాంతాల్లో ఆచారంగా ఉంది. శివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా మనసుకు ప్రశాంతత, కుటుంబానికి శుభం, జీవితంలో సానుకూలత కలుగుతాయని భక్తుల విశ్వాసం. అయితే పూజల అసలు ఉద్దేశం కేవలం కోరికలు నెరవేరడం మాత్రమే కాకుండా, మనలో నియమం, నిష్ఠ, దయ, సహనం, ఆత్మ నియంత్రణ వంటి మంచి లక్షణాలను పెంపొందించుకోవడమే.

### శ్రావణ సోమవారాల ప్రత్యేకత

శ్రావణ మాసంలోని ప్రతి సోమవారం భక్తులకు ప్రత్యేకమైనదే. తెల్లవారుజామునే భక్తులు స్నానాలు చేసి శివాలయాలకు వెళ్లి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. కొందరు ఉపవాసం పాటిస్తారు. మరికొందరు రోజంతా సాత్వికాహారం తీసుకుంటూ శివనామస్మరణలో గడుపుతారు.'ఓం నమః శివాయ' అనే పంచాక్షరి మంత్రాన్ని జపించడం శివారాధనలో ముఖ్యమైన భాగంగా భావిస్తారు. బిల్వపత్రాన్ని శివుడికి సమర్పించడం కూడా విశిష్టమైన ఆచారం. బిల్వదళం పవిత్రమైనదిగా శైవ సంప్రదాయంలో భావించబడుతుంది.శ్రావణ సోమవారాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా జాతర వాతావరణం కనిపిస్తుంది. స్థానిక శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### మంగళగౌరి వ్రతం.. మహిళలకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక పర్వం

శ్రావణ మాసంలో మంగళవారాలకు కూడా విశేషమైన ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా వివాహిత మహిళలు మంగళగౌరి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కుటుంబ సౌభాగ్యం, భర్త ఆరోగ్యం, పిల్లల శ్రేయస్సు, ఇంట్లో సుఖశాంతులు కలగాలని కోరుకుంటూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.మంగళగౌరి వ్రతం సందర్భంగా మహిళలు పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని అలంకరించి పూజిస్తారు. ఒకరినొకరు పిలిచి వాయనాలు ఇచ్చుకోవడం, పసుపు కుంకుమలు పెట్టుకోవడం వంటి సంప్రదాయాలు తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తాయి.

ఈ వ్రతం కేవలం ఆచారంగా కాకుండా మహిళలను ఒకచోట చేర్చి పరస్పర ఆప్యాయతను పెంచే సామాజిక సంప్రదాయంగా కూడా నిలిచింది.

### వరలక్ష్మీ వ్రతం.. శ్రావణంలో అత్యంత విశిష్టమైన పర్వదినం

శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతానికి విశేషమైన ప్రాధాన్యత ఉంది. శ్రావణ శుక్రవారం రోజున నిర్వహించే ఈ వ్రతాన్ని లక్ష్మీదేవి ఆరాధనకు అంకితం చేస్తారు. సంపద, సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు.ఇళ్లలో పూజా మండపాలను అందంగా అలంకరించి, కలశాన్ని ఏర్పాటు చేసి, లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, నైవేద్యాలతో అమ్మవారిని పూజిస్తారు. పూజ అనంతరం ముత్తయిదువులకు తాంబూలాలు ఇవ్వడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

వరలక్ష్మీ వ్రతం ద్వారా కుటుంబంలో ఐశ్వర్యం మాత్రమే కాకుండా పరస్పర ప్రేమ, సౌభ్రాతృత్వం, సంతోషం పెరగాలని భక్తులు కోరుకుంటారు.

### శ్రావణ శుక్రవారాల విశిష్టత

శ్రావణ మాసంలోని శుక్రవారాలు అమ్మవారి ఆరాధనకు ప్రత్యేకమైన రోజులు. మహిళలు ఉదయాన్నే ఇళ్ల ముందు ముగ్గులు వేసి, పూజా మందిరాన్ని అలంకరించి, అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. పసుపు, కుంకుమలకు ఈ పూజల్లో ప్రత్యేక స్థానం ఉంటుంది.

కొన్ని ప్రాంతాల్లో ప్రతి శుక్రవారం ప్రత్యేక నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. పొరుగింటి మహిళలను పిలిచి తాంబూలాలు ఇవ్వడం, ప్రసాదాలు పంచుకోవడం వంటి సంప్రదాయాలు సామాజిక బంధాలను మరింత బలపరుస్తాయి.

### రక్షాబంధన్.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

శ్రావణ మాసంలో వచ్చే రక్షాబంధన్ కూడా ప్రత్యేకమైన పర్వదినం. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా రాఖీ పండుగను జరుపుకుంటారు.

సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి వారి శ్రేయస్సును కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణుల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యతను వ్యక్తం చేస్తారు. ఆధునిక కాలంలో కుటుంబ సభ్యులు దూర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ రాఖీ పండుగ ద్వారా అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు.

### శ్రావణ పౌర్ణమి.. అనేక సంప్రదాయాల సమ్మేళనం

శ్రావణ పౌర్ణమికి కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. రక్షాబంధన్‌తో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉపాకర్మ వంటి వేద సంప్రదాయాలు కూడా ఈ రోజున నిర్వహిస్తారు. వేదాధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, గురువుల పట్ల గౌరవం వంటి విలువలను ఈ పర్వదినం గుర్తుచేస్తుంది.మన సంప్రదాయాల్లో ఒకే పర్వదినానికి వివిధ ప్రాంతాల్లో విభిన్న ఆచారాలు ఉండటం భారతీయ సంస్కృతిలోని వైవిధ్యానికి నిదర్శనం.

### శ్రావణ మాసంలో దానధర్మాలకు ప్రాధాన్యం

శ్రావణ మాసంలో పూజలతో పాటు దానధర్మాలకు కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. అన్నదానం, వస్త్రదానం, విద్యార్థులకు సహాయం, పేదలకు అవసరమైన వస్తువులు అందించడం వంటి సత్కార్యాలను చేయాలని పెద్దలు సూచిస్తారు.దానం అంటే కేవలం డబ్బు ఇవ్వడం మాత్రమే కాదు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, వృద్ధులకు సహాయం చేయడం, విద్యార్థులకు పుస్తకాలు అందించడం, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి తోడ్పడడం కూడా దానధర్మంలో భాగమే.

'ఇచ్చినదే మిగులుతుంది' అనే భావనను శ్రావణ మాసపు ఆధ్యాత్మిక సంప్రదాయాలు మనకు గుర్తుచేస్తాయి.

### ప్రకృతితో ముడిపడిన శ్రావణం

శ్రావణ మాసం ప్రత్యేకత కేవలం పూజలు, వ్రతాల్లోనే లేదు. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని కూడా ఈ మాసం ప్రతిబింబిస్తుంది.వర్షాలు కురిసే కాలం కావడంతో మొక్కలు, చెట్లు కొత్త జీవాన్ని సంతరించుకుంటాయి. వ్యవసాయానికి ఈ కాలం ఎంతో ముఖ్యమైనది. రైతులు పంటలపై ఆశలు పెట్టుకునే సమయం కూడా ఇదే. ప్రకృతి పచ్చదనంతో కళకళలాడుతుంటే, గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.అందుకే శ్రావణ మాసంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, నీటి వనరులను కాపాడటం వంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను కూడా ప్రోత్సహించాలి. ప్రకృతిని దేవతా స్వరూపంగా భావించిన మన సంస్కృతి అసలు సందేశం ఇదే.

### ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి

శ్రావణ మాసంలో ఉపవాసాలు, నియమాలు పాటించడం అనేక కుటుంబాల్లో కనిపిస్తుంది. అయితే ఉపవాసం అంటే శరీరాన్ని ఇబ్బంది పెట్టడం కాదు. ఆరోగ్యానికి అనుగుణంగా, తగిన ఆహారం తీసుకుంటూ, అవసరమైతే వైద్యుల సూచనలను పాటిస్తూ ఆచారాలను నిర్వహించడం మంచిది.ఆధ్యాత్మికత మనిషిలో ప్రశాంతతను పెంచాలి. పూజలు, ధ్యానం, ప్రార్థన, భజనలు మనసును ఏకాగ్రం చేసే సాధనాలుగా మారాలి. ఆచారాల వెనుక ఉన్న మంచి ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం ద్వారా వాటి విలువ మరింత పెరుగుతుంది.

### కుటుంబ బంధాలను బలపరిచే మాసం

శ్రావణ మాసం కుటుంబ సభ్యులందరినీ ఒకచోట చేర్చే పండుగల సమాహారం. అమ్మవారి పూజలు, శివాలయ దర్శనాలు, వరలక్ష్మీ వ్రతం, రాఖీ, పౌర్ణమి వంటి సందర్భాల్లో బంధువులు కలుసుకుంటారు.

మారుతున్న జీవనశైలిలో కుటుంబ సభ్యులు ఒకరికొకరు దూరమవుతున్న సమయంలో ఇటువంటి పండుగలు బంధాలను తిరిగి బలపరుస్తాయి. పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం, చిన్నలకు సంప్రదాయాలను పరిచయం చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించడం ద్వారా తరతరాల మధ్య అనుబంధం కొనసాగుతుంది.

### ఆధునిక తరానికి శ్రావణం ఇచ్చే సందేశం

నేటి తరం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోంది. జీవితం వేగవంతమవుతున్న కొద్దీ మానసిక ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో శ్రావణ మాసం మనిషికి కొంత సమయాన్ని ఆధ్యాత్మికతకు కేటాయించుకోవాలని సూచిస్తుంది.పూజ చేయడం అంటే కేవలం దేవుడి ముందు దీపం వెలిగించడం కాదు. మనలోని చెడు ఆలోచనలను తొలగించి, మంచి ఆలోచనలను పెంపొందించుకోవడం కూడా పూజలో భాగమే. ఉపవాసం అంటే కేవలం ఆహారం మానేయడం కాదు. చెడు అలవాట్లను నియంత్రించడం కూడా ఒక విధమైన ఉపవాసమే. దానం అంటే కేవలం ధనం ఇవ్వడం కాదు. మన సమయం, జ్ఞానం, సహాయం ఇతరులకు అందించడం కూడా దానమే.ఈ దృక్పథంతో చూస్తే శ్రావణ మాసం ఆధునిక సమాజానికి కూడా ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తుంది.

### ఆలయాల్లో భక్తి సందడి

శ్రావణ మాసం ప్రారంభమైన వెంటనే గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. శివాలయాల్లో అభిషేకాలు, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, విష్ణు ఆలయాల్లో అర్చనలు నిర్వహిస్తారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రాకపోకలతో ఆలయాలు సందడిగా కనిపిస్తాయి. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. భజనలు, హరికథలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించడం ఆనవాయితీ.ఈ కార్యక్రమాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంచడమే కాకుండా సామాజిక ఐక్యతకు కూడా దోహదపడతాయి.

### భక్తి అంటే మానవత్వం

శ్రావణ మాసం మనకు అందించే అత్యంత గొప్ప సందేశం మానవత్వం. దేవుడిని పూజిస్తూ పక్కనున్న మనిషిని నిర్లక్ష్యం చేయడం కంటే, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం గొప్ప భక్తి.

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, నిరాశలో ఉన్నవారికి ధైర్యం చెప్పడం, వృద్ధులను గౌరవించడం, పిల్లలకు విద్యలో సహాయం చేయడం, ప్రకృతిని కాపాడడం, జంతువుల పట్ల దయ చూపడం వంటి ప్రతి మంచి పని కూడా ఆధ్యాత్మికతలో భాగమే. మనిషి హృదయంలో దయ, ప్రేమ, కరుణ, సహనం పెరిగితే అదే నిజమైన పూజ. మన ప్రవర్తనలో మంచితనం కనిపిస్తే అదే నిజమైన వ్రత ఫలం.

### శ్రావణం.. సంస్కృతి, సంప్రదాయం, సనాతన విలువల సంగమం

శ్రావణ మాసం కేవలం ఒక నెల కాదు. ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కుటుంబ విలువలు, ప్రకృతి ప్రేమ, దానధర్మం, ఆధ్యాత్మికతల సమ్మేళనం. శివారాధన నుంచి లక్ష్మీపూజ వరకు, మంగళగౌరి వ్రతం నుంచి రక్షాబంధన్ వరకు ఎన్నో పర్వదినాలు ఈ మాసాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. పండుగల రూపాలు కాలానుగుణంగా మారవచ్చు. పూజా విధానాల్లో మార్పులు రావచ్చు. కానీ వాటి వెనుక ఉన్న మౌలిక విలువలు మాత్రం ఎప్పటికీ నిలిచి ఉండాలి. కుటుంబాన్ని కలిపి ఉంచడం, పెద్దలను గౌరవించడం, ప్రకృతిని ప్రేమించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, సమాజంలో పరస్పర గౌరవాన్ని పెంపొందించడం వంటి విలువలే శ్రావణ మాసపు అసలైన సారాంశం.

శ్రావణ మాసం వచ్చిందంటే ఇంటింటా పూజా సుగంధాలు, ఆలయాల్లో గంటానాదాలు, భక్తుల నామస్మరణలు, పచ్చని ప్రకృతి అందాలు కనిపిస్తాయి. శివుని అనుగ్రహం కోసం సోమవారాల్లో భక్తులు ఉపవాసాలు చేస్తారు. అమ్మవారి కరుణ కోసం శుక్రవారాల్లో పూజలు నిర్వహిస్తారు. కుటుంబ సౌభాగ్యం కోసం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగను జరుపుకుంటారు. దానధర్మాలతో సమాజానికి తమ వంతు సేవ చేస్తారు.

అందుకే శ్రావణ మాసాన్ని భక్తికి ప్రతీకగా, కుటుంబ బంధాలకు వారధిగా, ప్రకృతి ప్రేమకు ప్రతిరూపంగా, మానవత్వానికి మార్గదర్శకంగా భావించవచ్చు.

శ్రావణ మాసంలో దేవుడిని ఎంతగా ఆరాధిస్తామో, అంతే స్థాయిలో మనిషిని ప్రేమిద్దాం. ప్రకృతిని పూజిస్తే దాన్ని కాపాడుదాం. దానం చేస్తే ఆపదలో ఉన్నవారికి చేయూతనిద్దాం. వ్రతాలు చేస్తే మంచి విలువలను జీవితంలో ఆచరిద్దాం. అప్పుడు మాత్రమే శ్రావణ మాసపు ఆధ్యాత్మికత మన జీవితాల్లో నిజమైన వెలుగును నింపుతుంది.

శ్రావణం అంటే శుభానికి స్వాగతం..
శ్రావణం అంటే భక్తికి ప్రతీక..
శ్రావణం అంటే కుటుంబ అనుబంధాలకు పండుగ..
శ్రావణం అంటే ప్రకృతితో మమేకమయ్యే పవిత్ర సమయం..
శ్రావణం అంటే మానవత్వాన్ని మేల్కొలిపే ఆధ్యాత్మిక సందేశం.

## ఉరికి వేలాడుతూ మూడు నెలల గర్భిణి మృతి..

## మరో అత్తవారింటి వేధింపుల ఘటనేనా




ఢిల్లీలో దారుణం జరిగింది. మూడు నెలల గర్భిణి అనుమానాస్పదంగా మరణించింది. మృతురాలు ప్రభుత్వ ఉద్యోగి. మృతురాలి పేరు నజియా ఖానం (30). భర్త, అత్త, కుటుంబ సభ్యుల వేధింపుల వల్లే నజియా మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన ఢిల్లీలోని ద్వారకా నగర్‌లో ఆగష్టు 21, శుక్రవారం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నజియా ఖానం రక్షణ మంత్రిత్వ శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. నజియాకు ఈ ఏడాది ఏప్రిల్ 11న అజ్మ్ అలీ ఖాన్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. ఇప్పుడు నజియా మూడు నెలల గర్భిణి కూడా. అయితే, ఆమె శుక్రవారం తన ఇంట్లో ఉరివేసుకుంది. నజియాను ఆమె భర్త రాత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. నజియా మృతిపై ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.భర్త, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యుల వేధింపుల వల్లే నజియా మరణించిందని ఆరోపిస్తున్నారు. పెళ్లైన తర్వాత నుంచి నజియాను వారు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. తనను చంపుతామని బెదిరించారని కూడా నజియా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. భర్త అజ్మ్ అలీ ఖాన్, అత్త సామిన్ నిషా, మామ బాబర్ అలీ ఖాన్, ఇతర కుటుంబ సభ్యులు కలిసి ఆమెపై తరచూ వేధింపులకు పాల్పడ్డారు అని చెప్పారు. తనపై జరుగుతున్న వేధింపుల గురించి నజియా తమకు ఫోన్‌లో ఎన్నోసార్లు ఆవేదనగా చెప్పిందన్నారు. నజియా మృతిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై నజియా భర్త చెబుతున్న వివరాలు ఇవి. తనకు, నజియాకు మధ్య గొడవ జరిగింది. వెంటనే ఆమె తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతకీ తలుపు తెరవకపోవడంతో నజియా భర్త ఇంటి యజమానికి పిలిచాడు. అతడు ఒక నిచ్చెన ద్వారా బాల్కనీలోంచి వెళ్లి ఆమెను రక్షించాడు. ఈలోపు ఆమె చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## జనసంద్రంగా మారిన ఏడుపాయల



పాపన్నపేట, ఆగస్టు 23 : మెదక్ జిల్లా పాపన్నపేటలోని ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం ఆదివారం వేలాది భక్తు లతో జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా పాయల్లో స్నానాలు చేసి, అమ్మవారిని దర్శిం చుకున్నారు. అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ దుర్గమ్మకు పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఒడిబియ్యం పోసి, బోనాలు తీసి భక్తులు మొక్కులు చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నర్సింలు, బత్తిని రాజు, బ్రహ్మాచారి, యాదగిరి నరేష్ తదితరులు ఏర్పాట్లు చేశారు. పోలీ సులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో యువకుడి కిడ్నాప్‌కు యత్నం



నాగర్ కర్నూల్ : మద్యం మత్తులో యువకుడి కిడ్నాప్‌కు పాల్పడిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వలో చోటు చేసుకుంది. కొంతమంది యువకులు మద్యం మత్తులో సెంట్రింగ్ పని చేస్తున్న రాజు అనే ఒక యువకుడ్ని కిడ్నాప్ చేయడానికి యత్నించిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక కారులో ఆరు మంది యువకులు వచ్చి గ్రామంలో కొద్దిసేపు హల్ చల్ చేశారు. ఓ పాత పంచాయితీ విషయంలో యువకుడిని కిడ్నాప్ చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు.దీంతో స్థానిక గ్రామస్తులు వారిని అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకను గ్రహించి ఆ యువకులు అక్కడినుండి పారిపోయి నట్లు తెలిపారు. ఈ ఘటనపై రాజు అనే యువకుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శంషాద్దీన్ తెలిపారు.

# అర్హులైన క్రీడాకారిణులు హాజరుకావాలి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంగారి గణేష్ తెలిపారు. 2011 జనవరి 1 నుంచి 2013 డిసెంబర్ 31 మధ్య జన్మించిన క్రీడాకారిణులు ఈ ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారిణులు ఈ నెల 26న ఉదయం 9 గంటలకు గజ్వేల్‌లోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు హాజరు కావాలని సూచించారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారిణులు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885689008, 9989484657, 8121392441 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్బర్, జాయింట్ సెక్రటరీ నర్సింలు, సాజిద్, చక్రపాణి, సభ్యులు సందేమైనా ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ చేతిలో.. దిశ మన చేతుల్లో

**- ఉద్యోగం కోసం చూడొద్దు.. ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి**

**- ఏఐ, రోబోటిక్స్‌తో మారుతున్న ప్రపంచం..**

**నైపుణ్యం, పట్టుదల, నిబద్ధతే విజయానికి బాట**



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) చేతిలో డిగ్రీ ఉందని భవిష్యత్తు భద్రమైపోయినట్లు భావించొద్దు.. అది అవకాశాల తలుపు తెరిచే ఒక తాళంచెవి మాత్రమే. ఆ తలుపు దాటి విజయం సాధించాలంటే నైపుణ్యం, పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధత, వ్యక్తిత్వం అవసరం. ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా.. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపుతూ ఉద్యోగాలను సృష్టించే 'జాబ్ క్రియేటర్స్'గా ఎదగాలి అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.గీతం యూనివర్సిటీ 17వ స్నాతకోత్సవంలో ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పట్టాలు అందుకున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన అంశాలను వివరిస్తూ.. కేవలం విద్యార్హతతోనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

### డిగ్రీ.. ఆరంభమే

"మీ డిగ్రీ ఒక కీ మాత్రమే.. డెస్టినేషన్ కాదు" అని డా. పెమ్మసాని స్పష్టం చేశారు.డిగ్రీ అవకాశాల తలుపులు తెరుస్తుందని.. కానీ ఆ తర్వాతి ప్రయాణంలో విజయం సాధించేది విద్యార్థి నైపుణ్యం, అనుభవం, క్రమశిక్షణ, వ్యక్తిత్వం ఆధారంగానేనని తెలిపారు.అకడమిక్ ప్రతిభ ప్రారంభ అవకాశాలను అందించగలదని.. అయితే దీర్ఘకాలిక కెరీర్ విజయానికి పట్టుదల, నాయకత్వ లక్షణాలు, భావోద్వేగ నియంత్రణ, బాధ్యతాయుత వైఖరి, సవాళ్లను స్వీకరించే ధైర్యం వంటి వ్యక్తిగత లక్షణాలు మరింత కీలకమని వివరించారు.

# ఢిల్లీలో శివాలయానికి మళ్లీ పూజల సందడి

**ఏపీ భవన్ పురాతన ఆలయాన్ని పరిశీలించిన**

**దుర్గగుడి ఈవో శీనా నాయక్**



విజయవాడ(ప్రశ్న న్యూస్)దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రాంగణంలో ఉన్న పురాతన శివాలయానికి మళ్లీ పూజా కార్యక్రమాలు పునరుద్ధరించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఏళ్లుగా అనధికారిక వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఈ ఆలయం ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీ భవన్ పరిధిలోకి రావడంతో.. నిత్య కైంకర్యాలు, అర్చనాది పూజలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించేందుకు విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం చర్యలు చేపడుతోంది.ఈ నేపథ్యంలో విజయవాడ దుర్గగుడి కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఆదివారం ఏపీ భవన్‌లోని పురాతన శివాలయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ పరిస్థితులు, పూజా కార్యక్రమాల నిర్వహణ, అవసరమైన సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు.

### హైకోర్టు ఆదేశాలతో ఏపీ భవన్ పరిధిలోకి..

ఏళ్ల తరబడి అనధికారిక వ్యక్తుల ఆధీనంలో ఉన్న పురాతన శివాలయం.. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీ భవన్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. న్యూఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయ సూచనలు, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏపీ భవన్ ఎస్టేట్ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఆలయం అధికారిక పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో ఇకపై పూజా కార్యక్రమాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు.

### పూజలకు ఆటంకం ఉండకూడదు

ఆలయ నిర్వహణలో మార్పులు వచ్చినా భక్తులకు, దేవతా పూజలకు ఎలాంటి ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో దుర్గగుడి అధికారులు తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం తరఫున నిత్య కైంకర్యాలు, అర్చనాది పూజలు

# ఆరు మాసాలకే 'ఆకాశమంత' అవినీతి ఆరోపణలు

**కొత్త పాలకవర్గంపై కొల్లగొట్టుడు ఆరోపణలు**

**'మెయింటెనెన్స్' పేరుతో ప్రజాధనం ఖర్చు చేసేందుకు స్కెచ్.?**

**ప్రజల సొంత డబ్బులతో వేసుకున్న రోడ్డుపై అధికారుల 'డ్రిల్లింగ్' జిమ్మిక్కులు**

**గజ్వేల్‌లో చర్చనీయాంశంగా మారిన 5వ వార్డు రోడ్డు వ్యవహారం**





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గం కొలువుదీరి ఆరు మాసాలు పూర్తికాకముందే ప్రజాధనం వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం కంటే మున్సిపల్ ఖజానా నుంచి నిధులు ఖర్చు చేసే మార్గాలపైనే కొందరు దృష్టి సారిస్తున్నారంటూ స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా 5వ వార్డులోని ఓ సీసీ రోడ్డు వ్యవహారం ప్రస్తుతం మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది.

### ప్రజల సొంత డబ్బులు.. 'మెయింటెనెన్స్' బిల్లుల మాయాజాలమా?

5వ వార్డులో మున్సిపాలిటీ నుంచి తగిన స్పందన లేకపోవడంతో స్థానికులు తమ సొంత డబ్బులు వెచ్చించి సీసీ రోడ్డును నిర్మించుకున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే అదే రోడ్డును మున్సిపల్ పనిగా చూపించి 'మెయింటెనెన్స్' పేరుతో నిధులు ఖర్చు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు రోడ్డుపై క్వాలిటీ చెకప్ పేరుతో డ్రిల్లింగ్ చేయడం స్థానికుల్లో అనుమానాలకు తావిచ్చింది. ఇప్పటికే ప్రజలు సొంత నిధులతో నిర్మించుకున్న రోడ్డుపై మళ్లీ మున్సిపల్ నిధులతో ఎలాంటి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు ప్రశ్నిస్తున్నారు.

### ఆరు నెలలకే 'కమిషన్ల' ఆరోపణలు!

కొత్త పాలకవర్గం ఏర్పడిన కొద్దికాలానికే కొందరు కౌన్సిలర్లు ప్రజాధనాన్ని తమకు అనుకూలంగా వినియోగించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అధికారులు, ప్రజలు తమ సొంత డబ్బులతో నిర్మించుకున్న రోడ్డుపై మున్సిపల్ నిధుల పేరుతో జోక్యం చేసుకోవడం ఏమిటని వారు నిలదీస్తున్నారు. అవినీతికి అవకాశం ఉన్న ప్రతి అంశంలో జోక్యం చేసుకుంటున్నారంటూ కొందరు ప్రజాప్రతినిధులపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

### సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్

ఈ వ్యవహారంపై మున్సిపల్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి అయిన ఖర్చు, పనికి సంబంధించిన అనుమతులు, అంచనాలు, మెయింటెనెన్స్ బిల్లులు, చెల్లింపుల వివరాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు. ప్రజల సొంత డబ్బులతో నిర్మించిన రోడ్డుకు సంబంధించి మున్సిపల్ ఖజానా నుంచి నిధులు ఖర్చు చేశారా? ఒకవేళ ఖర్చు చేస్తే ఏ నిబంధనల ప్రకారం చేపట్టారు? డ్రిల్లింగ్ ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రజాధనానికి నష్టం వాటిల్లకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

# దళిత కాలనీలపై ఇదేనా నిర్లక్ష్యం.?

**నీళ్లలో డ్రైనేజీ.. వర్షానికే ఇళ్లలోకి నీరు!**

**రోడ్డు లేదు.. స్మశానానికి దారి లేదు.. పాఠశాలలో వసతుల్లేవు**

**మౌలిక వసతుల కోసం 'ఛలో కలెక్టరేట్'కు పిలుపు**



తిరుపతి (ప్రశ్న న్యూస్)దళిత, పేద ప్రజలు నివసించే కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. తాగునీటి నుంచి డ్రైనేజీ వరకు.. రోడ్ల నుంచి పారిశుధ్యం వరకు.. స్మశానవాటికకు దారి నుంచి పాఠశాలల్లో కనీస వసతుల వరకు.. ఏ సమస్య చూసినా స్థానికులను వేధిస్తోంది. ఏళ్ల తరబడి సమస్యలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 24న 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు.తిరుపతిలో దళిత, పేద ప్రజలు నివసించే కాలనీల్లో మౌలిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి నిర్వహిస్తున్న సామాజిక శంఖారావం ఆటోమైక్ ప్రచార యాత్ర రెండో రోజు ఉప్పంగి హరిజనవాడ, ఎస్‌టీవీ నగర్, న్యూ ఇందిరానగర్, అంబేద్కర్ కాలనీ ప్రాంతాల్లో కొనసాగింది. నాయకులు కాలనీల్లో పర్యటించి ప్రజలను నేరుగా కలిసి సమస్యలను తెలుసుకున్నారు.ఉప్పంగి హరిజనవాడలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. వర్షం కురిసిన సమయంలో రైల్వే గేట్ వైపు నుంచి వచ్చే వర్షపు నీరంతా కాలనీలోకి చేరి ఇళ్లలోకి ప్రవేశిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇళ్లు మునిగిపోయే పరిస్థితి నెలకొంటోందని తెలిపారు.వర్షపు నీరు కాలనీలోకి రాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక చర్యలతో సమస్య పరిష్కారం కాదని.. శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఉప్పంగి హరిజనవాడలో మరో విషాదకర సమస్యను స్థానికులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. స్మశానవాటికకు సరైన రహదారి లేకపోవడంతో మృతదేహాలను తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.చివరి ప్రయాణానికి కూడా సరైన దారి లేకపోవడం ఏ స్థాయి నిర్లక్ష్యానికి నిదర్శనం? అంటూ ప్రశ్నించారు. స్మశానవాటికకు తక్షణమే రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, విద్యార్థులు ప్రార్థనలు నిర్వహించే స్టేజీని మరమ్మతు చేయాలని ప్రజలు కోరారు.ఎస్‌టీవీ నగర్‌లో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతున్నప్పటికీ.. ఆ నీరు కూడా డ్రైనేజీ నీటితో కలిసిపోయి పచ్చగా, దుర్వాసనతో వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కలుషిత నీటిని ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రజల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రైనేజీ కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయి కుళ్లిపోతోందని, దుర్వాసన వ్యాపిస్తోందని తెలిపారు.కాలువల కారణంగా దోమల బెడద పెరిగిందని, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### తెలుగు గంగ నీటిలోనూ మురికినీళ్ల కలయిక?

న్యూ ఇందిరానగర్ కాలనీలోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు తెలిపారు. తెలుగు గంగ నీటిలో డ్రైనేజీ నీరు కలుస్తోందని వారు ఆరోపించారు. మున్సిపల్ నీటి సరఫరా కూడా సక్రమంగా లేదని.. మూడు రోజులకు ఒకసారి నీరు వస్తోందని చెప్పారు.డ్రైనేజీ కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో ప్రజలు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
కాలనీలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, కుక్కల బెడదను అరికట్టాలని, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఎస్‌టీవీ నగర్ నుంచి కొత్త ఇళ్ల వైపు వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు వేగంగా ప్రయాణిస్తున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల రాకపోకలకు అనుగుణంగా రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రమణ్యం, సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్ మాట్లాడుతూ దళిత కాలనీల్లో ప్రజలు సంవత్సరాలుగా అనేక సమస్యలతో సతమతమవుతున్నా అధికారులు సరైన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు.కులం, ప్రాంతం, ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సమానమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. దళిత కాలనీలపై జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఇకనైనా విడనాడాలని డిమాండ్ చేశారు.
తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, రోడ్లు, స్మశానవాటికలకు దారులు, పాఠశాలల్లో మౌలిక వసతులు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

### ఇళ్లులేని కుటుంబాలకు స్థలాలు ఇవ్వాలి

ఇళ్లులేని దళిత కుటుంబాలను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. కేవలం స్థలాలు కేటాయించడం కాకుండా పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు.
పేద కుటుంబాలు ఏళ్ల తరబడి కనీస వసతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### అర్జీతో కదలాలి.. కలెక్టరేట్‌కు రావాలి

ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని నాయకులు సూచించారు. ప్రతి బాధిత కుటుంబం తమ వ్యక్తిగత సమస్యపై ప్రత్యేకంగా అర్జీ రాసుకుని ఆగస్టు 24న నిర్వహించే 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.
కాలనీల్లో సేకరించిన సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు."దళిత కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం దయ కాదు..
ప్రజలకు ఉన్న హక్కు. ఆ హక్కు సాధించే వరకు పోరాటం ఆగదు" అని నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పి. బుజ్జి, ఎన్. రఘు, డి. పార్థసారథి, ఎం. రాజు, ఆర్. మల్లికార్జునరావు, జి. వాసు, సీహెచ్. గణేష్, శేషయ్య, బాదుల్లా, పి. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో విన్ ఇండియా ఆవిష్కరణ

**మహిళా ఆవిష్కర్తలకు గ్లోబల్ వేదికగా**

**విన్ ఇండియా**

**మహిళా ఆధ్వర్యంలోని ఆవిష్కరణలను**

**గ్లోబల్ మార్కెట్లు, పెట్టుబడిదారులు,**

**వ్యూహాత్మక భాగస్వాములతో**

**అనుసంధానించనున్న విన్ ఇండియా**





హైదరాబాద్(ప్రశ్న న్యూస్) మహిళా పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలను ప్రోత్సహించి, వారి ఆవిష్కరణలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో హెల్త్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో విన్ ఇండియా -- ఉమెన్ ఇన్నోవేషన్ ఇండియా వేదికను హైదరాబాద్‌లో ప్రారంభించారు.హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి వైద్య రంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు, మీడియా ప్రతినిధులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రముఖ సినీ నటుడు మొహమ్మద్ అలీ, దర్శకుడు అనుదీప్, యశోద హాస్పిటల్స్ సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డా. టి. దశరథ రామారెడ్డితో పాటు విన్ ఇండియా కోర్ సభ్యులు నవీనా చౌదరి కొయ్యలమూడి, నవనీత్ సింగ్, డా. బిజు జాకబ్, వేణు పుతుస్సేరి, కృతి గురజాడ, సూచి గరివాలా, రోజ్ వేజ్ తదితరులు, సుమారు 50 మంది అతిథులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఈఓ ప్రదీప్ కక్కట్టిల్ మాట్లాడుతూ 2018లో జెనీవాలో ఐక్యరాజ్యసమితి పరిధిలో ప్రారంభమైన సాంకేతికత ఆవిష్కరణల ద్వారా ఆరోగ్య సేవలను అందరికీ చేరువ చేయడానికి పనిచేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళా పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు పెట్టుబడులు, అవకాశాలు, అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.భారత్ ఫార్మాస్యూటికల్ రంగంలో ప్రపంచానికి కీలక కేంద్రంగా ఎదిగిందని, ప్రస్తుతం భారతీయ మహిళా మెడ్ టెక్, డిజిటల్ హెల్త్, ఏఐ ఫర్ హెల్త్ కేర్ పారిశ్రామికవేత్తలు వంటి రంగాల్లో వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. విన్ ఇండియా ద్వారా మహిళా ఆవిష్కర్తలను గుర్తించి, వారికి కొత్త మార్కెట్లలోకి ప్రవేశం, పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, అంతర్జాతీయ అవకాశాలను కల్పించనున్నట్లు చెప్పారు.విన్ ఇండియా కోర్ కమిటీ ఆర్గనైజర్ డా.పద్మిని మూర్తి మోక్షగుండం మాట్లాడుతూ, మహిళా పారిశ్రామికవేత్తలకు గ్లోబల్ వేదిక కల్పించడమే విన్ ఇండియా లక్ష్యమన్నారు. "చిన్న సహాయం కూడా పెద్ద మార్పుకు కారణమవుతుంది. మహిళలు ఎదిగితే మరెంతో మంది మహిళలకు అవకాశాలు కల్పించగలరు," అని అన్నారు.విన్ ఇండియా కోర్ కమిటీ ఆర్గనైజర్ రష్మీ శర్మ మాట్లాడుతూ సరైన వ్యక్తులు, సరైన ఆలోచనలు, సరైన అవకాశాలు కలిసినప్పుడు అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. భారతీయ మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను ప్రపంచ స్థాయిలో ప్రదర్శించి, అభివృద్ధి చెందేందుకు విన్ ఇండియా సహకరిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళా ఆవిష్కర్తల నుంచి త్వరలో దరఖాస్తులను ఆహ్వానించి, ప్రతిభావంతులను ఎంపిక చేసి అంతర్జాతీయ స్థాయిలో వారికి అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారత్ నుంచి ప్రపంచానికి మహిళా ఆవిష్కరణలను తీసుకెళ్లడమే విన్ ఇండియా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# 'దృశ్యం 4' రాబోతోంది..

## 'జార్జ్‌కుట్టి'గా మళ్లీ మోహన్‌లాల్!



భారతీయ సినీ చరిత్రలో కల్ట్ క్లాసిక్ థ్రిల్లర్‌గా నిలిచిన 'దృశ్యం' ఫ్రాంచైజీ అభిమానులకు ఓ అదిరిపోయే శుభవార్త. ఈ ఉత్కంఠభరిత కథను కొనసాగిస్తూ 'దృశ్యం 4' రాబోతోందని చిత్ర నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ అధికారికంగా ప్రకటించారు. దీంతో జార్జ్‌కుట్టి అనే ఐకానిక్ పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ మరోసారి ప్రేక్షకులను అలరించడం ఖాయమైంది. 'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ చిత్రాల స్ఫూర్తితోనే కథను మరో మెట్టు పైకి తీసుకెళ్లేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ ఫ్రాంచైజీ సృష్టికర్త, టాలెంటెడ్ డైరెక్టర్ జీతూ జోసెఫ్ ఈ నాలుగో భాగానికి కూడా దర్శకత్వం వహించనుండటంతో అంచనాలు రెట్టింపయ్యాయి. సాధారణ మధ్యతరగతి కుటుంబ పెద్ద అయిన జార్జ్‌కుట్టి, తన కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం పన్నిన వ్యూహాలు ప్రేక్షకులను సీట్లకు అతుక్కుపోయేలా చేశాయి. ఇప్పుడు 'దృశ్యం 4'లో జార్జ్‌కుట్టి ఎలాంటి సవాళ్లను ఎదుర్కోబోతున్నాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నిర్మాత ఆంటోనీ చేసిన ఈ ఆకస్మిక ప్రకటనతో భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే చర్చ మొదలైంది. మోహన్‌లాల్ - జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

# 'సహా'.. ఓ భావోద్వేగ ప్రయాణం

శివకుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రలు పోషించిన ఎమోషనల్ డ్రామా 'సహా'(లైఫ్ ఆఫ్ సంజు). నిశాంత్ దోటి దర్శకుడు. తేజ వెల్పుచర్ల నిర్మాత. సెప్టెంబర్ 4న థియేటర్లలో సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ శనివారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు శివకుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ మెట్రో రైల్‌లో ప్రయాణిస్తూ ఆత్మీయంగా కనిపిస్తున్నారు. వీరిద్దరి పాత్రల మధ్య ఉన్న ప్రేమబంధాన్ని ఆవిష్కరించేలా ఈ స్టిల్ ఉన్నది. ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, భావోద్వేగాల సంఘర్షణల చుట్టూ సాగే ఎమోషనల్ డ్రామా ఈ సినిమా అని మేకర్స్ తెలిపారు. వ్రజనా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతీ, మేఘన, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: కరుణాకర్.కె, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: సుమైరా స్టూడియోస్.



# 13 ఏళ్ల కెరీర్‌పై రాశీ ఖన్నా – ఏమన్నారంటే...!



ప్రముఖ నటి రాశీ ఖన్నా భారత చిత్ర పరిశ్రమలో తన 13 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. 2013లో 'మద్రాస్ కేఫ్' చిత్రంతో నటిగా అరంగేట్రం చేసిన ఆమె, అప్పటి నుంచి సమయం చాలా వేగంగా గడిచిపోయిందని అన్నారు. పనిని ఎల్లప్పుడూ ఒక అదృష్టంగా భావించడం వల్లే తనకు అలా అనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల '120 బహదూర్' చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించిన రాశీ, తన కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ, "పదమూడేళ్లు సుదీర్ఘ సమయం. కానీ, పనిని ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను కాబట్టి సమయం తెలియలేదు. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే, నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నేను చెప్పాలనుకున్న కథలకు ఆ సినిమా అవకాశం ఇచ్చింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని తెలిపారు. 'మద్రాస్ కేఫ్' తర్వాత ఆమె కెరీర్ వేగం పుంజుకుంది. తొలి సినిమా నుంచే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాశీ ఖన్నా, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. విభిన్న భాషల్లో నటించడం కేవలం యాదృచ్ఛికం కాదని, స్పష్టమైన ప్రణాళికతోనే బహుభాషా నటిగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు పొందారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫర్జీ' వెబ్ సిరీస్ రెండవ సీజన్‌లో ఆమె నటిస్తున్నారు. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో ఆమె ఆర్‌బీఐ అధికారిణి మేఘా వ్యాస్ పాత్రను మరోసారి పోషించనున్నారు. దీనితో పాటు, సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా రాబోతున్న తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'ధర్మన్'లోనూ, బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ హీరోగా అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న కామెడీ డ్రామాలోనూ ఆమె హీరోయిన్‌గా కనిపించనున్నారు.

## బర్త్‌డే స్పెషల్.. తేజా సజ్జా 'జాంబీ రెడ్డి 2'

# అనౌన్స్‌మెంట్ వచ్చేసింది

యువ హీరో తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ మోస్ట్ క్రేజీ సీక్వెల్ 'జాంబీ రెడ్డి 2: నెక్స్ట్ లెవెల్' టైటిల్ అనౌన్స్మెంట్ వీడియో విడుదలైంది. మొదటి సినిమాతో తెలుగు తెరపై జాంబీ జోనర్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, ఇప్పుడు ఈ సీక్వెల్‌ను మరింత పెద్ద స్థాయిలో తీసుకువస్తున్నారు. కేవలం తెలుగుకే పరిమితం కాకుండా, ఈసారి పాన్ ఇండియా స్థాయిలో భారీ మల్టీలింగ్వల్ ప్రాజెక్ట్‌గా 2027లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మాతలు టి.జి. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మొదటి భాగానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ ఈసారి కథను అందిస్తుండగా, 'ది ఫ్యామిలీ మ్యాన్', 'రాణా నాయుడు' వంటి వెబ్ సిరీస్‌లతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సుపర్ణ్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో తేజా సజ్జాతో పాటు కన్నడ స్టార్ ఉపేంద్ర ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ బ్యూటీ షనయా కపూర్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ సినిమా "బిగ్గర్, బ్యాడర్ & బ్లడీర్"గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన గౌర హరి ఈ సీక్వెల్‌కు కూడా సంగీతం అందిస్తున్నారు. హుస్సేన్ దలాల్, ప్రశాంత్ వర్మ, సుపర్ణ్ వర్మ సంయుక్తంగా ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. "డెడ్ ఆర్ అలైవ్" అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా అనౌన్స్మెంట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# పెంపకంపై వివాదం..

## తాప్సీ వ్యాఖ్యలకు కంగనా కౌంటర్!



బాలీవుడ్‌లో మరోసారి మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. నటి తాప్సీ పన్ను ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కంగనా రనౌత్‌తో తనకున్న వివాదంపై స్పందించగా, దీనిపై కంగనా తీవ్రంగా మండిపడ్డారు. తాప్సీ చేసిన వ్యాఖ్యలు తన పెంపకాన్ని, తల్లిదండ్రులను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ కంగనా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఘాటుగా స్పందించారు. తన తల్లిదండ్రులు ఒరిజినల్ వ్యక్తికి జన్మనిస్తే, ఆమె తల్లిదండ్రులు మాత్రం ఒక 'సస్తీ కాపీ' (చౌకైన నకలు)ని ఎందుకు కనాల్సి వచ్చిందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ, కంగనా రనౌత్‌ను తాను ఎప్పుడూ కలలో కూడా కలవలేదని, తమ మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు తమ పెంపకం, ఆలోచనా విధానాన్ని బట్టే ఉంటాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపైనే కంగనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాప్సీ తన కొత్త సినిమా ప్రమోషన్లలో భాగంగా కేవలం తన పేరును మాత్రమే హైలైట్ చేసుకుంటున్నారని విమర్శించారు. కాగా, 2019లో 'జడ్జిమెంటల్ హై క్యా' సినిమా సమయంలో కంగనా సోదరి రంగోలీ చందేల్.. తాప్సీని 'సస్తీ కాపీ' అంటూ విమర్శించడంతో వీరిద్దరి మధ్య వివాదం ప్రారంభమైంది.

ఆ తర్వాత 2020లో బంధుప్రీతి (నెపోటిజం) చర్చల సమయంలో కంగనా తాప్సీని 'బి-గ్రేడ్ నటి' అంటూ విమర్శించడం గమనార్హం. ఇక తాప్సీ రాజకీయాల్లో ప్రవేశించే ఆలోచనపై స్పందిస్తూ, తాను రాజకీయాలకు తగినట్లుగా ఉండనని, తనది చాలా నిజాయితీ గల మనస్తత్వమని, ప్రస్తుతానికి సినిమాలపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఇక సినిమాల విషయానికి వస్తే, తాప్సీ నటించిన రివెంజ్ డ్రామా చిత్రం 'గాంధారి' సెప్టెంబర్ 3న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. మరోవైపు కంగనా రనౌత్ త్వరలో ఆర్. మాధవన్‌తో కలిసి ఓ పాన్-ఇండియా సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రంలో నటించనున్నారు.

## ఓటీటీలో దూసుకుపోతున్న 'చెన్నై లవ్ స్టోరీ'..

## ఫస్ట్ హాఫ్‌కు ఫిదా, సెకండాఫ్‌పై భిన్నాభిప్రాయాలు!




టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన రొమాంటిక్ డ్రామా 'చెన్నై లవ్ స్టోరీ' ప్రస్తుతం ఓటీటీలో మంచి సందడి చేస్తోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీ ద్వారా సినిమాను చూసేందుకు ఆసక్తి చూపుతుండటంతో ఈ మూవీకి కొత్త ఆడియన్స్ లభిస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఓటీటీలో మంచి స్పందన వస్తుండగా.. సినిమా కథనం విషయంలో మాత్రం ప్రేక్షకుల అభిప్రాయాలు రెండు విధాలుగా ఉన్నాయి. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్‌ను మెచ్చుకుంటున్న ప్రేక్షకులు.. సెకండాఫ్ విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే సోనీ లివ్లో స్ట్రీమింగ్‌కు వచ్చిన 'చెన్నై లవ్ స్టోరీ'కి ఓటీటీ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. థియేటర్లలో సినిమా చూడలేకపోయిన పలువురు ఇప్పుడు డిజిటల్ రిలీజ్‌తో మూవీని చూస్తున్నారు. థియేట్రికల్ రన్‌లో సినిమాకు వచ్చిన స్పందనతో పోలిస్తే ఓటీటీలో కొత్తగా సినిమాను చూస్తున్న ప్రేక్షకుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో 'చెన్నై లవ్ స్టోరీ' మరోసారి సోషల్ మీడియాలో చర్చకు వస్తోంది. సినిమా ఫస్ట్ హాఫ్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రేమకథ, ఎమోషనల్ సన్నివేశాలు, కథనంలో వచ్చే కొన్ని ఆసక్తికరమైన మలుపులు ప్రేక్షకులను ఎంగేజ్ చేశాయని అంటున్నారు. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రేమకథలోని భావోద్వేగాలను ఇద్దరూ బాగా పండించారని ఓటీటీ ప్రేక్షకులు కామెంట్లు చేస్తున్నారు. సినిమాకు మరో ప్రధాన ప్లస్ పాయింట్‌గా మణిశర్మ సంగీతం నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు. కథలోని ఎమోషనల్ సన్నివేశాలకు ఆయన అందించిన సంగీతం మంచి అనుభూతిని కలిగించిందనే ప్రశంసలు వస్తున్నాయి. ముఖ్యంగా రొమాంటిక్, ఎమోషనల్ సన్నివేశాల్లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే సినిమా ఇంటర్వెల్ తర్వాత కథనం విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలు మారుతున్నాయి. ఫస్ట్ హాఫ్‌లో ఉన్న వేగం, ఆసక్తి సెకండాఫ్‌లో కొనసాగలేదని కొంతమంది ఓటీటీ ప్రేక్షకులు అంటున్నారు. కథనం కొంత నెమ్మదించడం, కొన్ని సన్నివేశాలు ఆశించిన స్థాయిలో కనెక్ట్ కాకపోవడం వల్ల సెకండాఫ్‌పై తమకు పూర్తిగా సంతృప్తి కలగలేదని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం సెకండాఫ్‌లోని ఎమోషనల్ కంటెంట్‌ను అర్థం చేసుకుంటే సినిమా బాగానే అనిపిస్తుందని చెబుతున్నారు. దీంతో సెకండాఫ్ విషయంలో ప్రేక్షకుల మధ్య భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. సెకండాఫ్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ 'చెన్నై లవ్ స్టోరీ' మాత్రం ఓటీటీలో చర్చను కొనసాగిస్తోంది. ముఖ్యంగా థియేటర్లలో సినిమాను చూడలేకపోయిన ప్రేక్షకులకు ఇప్పుడు ఓటీటీలో చూసే అవకాశం రావడంతో మూవీకి మరోసారి ఆదరణ లభిస్తోంది.

# బన్నీ స్టైల్ కాపీ కొట్టా



'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళీ బ్యూటీ మమిత బైజూ. వరుస అవకాశాలు అందుకుంటూ సక్సెస్ రేస్‌లో దూసుకుపోతున్నది. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌ని ఫిదా చేసిన ఈ అమ్మడు నటించిన డ్యూడ్, జననాయగన్ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో నటించింది. ఈ సందర్భంగా అమ్మకుట్టి పంచుకున్న కార్వాన్ కబుర్లివి...మాది కేరళంలోని కొట్టాయం. నాన్న డాక్టర్. అన్నయ్య రాష్ట్రస్థాయి క్రికెటర్. నా జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలన్నీ మా అన్నయ్యే తీసుకుంటాడు. నాకొచ్చే లవ్ ప్రపోజల్స్‌ను డీల్ చేయడంతో పాటు నాకొచ్చే పెండ్లి సంబంధాల్లోనూ ఆయన నిర్ణయమే ఫైనల్.నా తొలి సినిమా 'సర్వోపరి పాలక్కారన్' అయినా, నాకంటూ గుర్తింపు తెచ్చింది మాత్రం ప్రేమలు చిత్రమే. దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో పాటు నా కెరీర్‌ని మలుపు తిప్పిన సినిమా ఇది. మలయాళి సినిమానే అయినా ఎక్కువ భాగం షూటింగ్ హైదరాబాద్‌లోనే చిత్రీకరించారు. అందుకే తెలుగు ప్రేక్షకులు దీన్ని ఎంతో ఆదరించారు.నేను అల్లు అర్జున్‌కు పెద్ద ఫ్యాన్‌ని. ఆయన నటించిన ఇద్దరమ్మాయిలు సినిమా అంటే నాకెంతో ఇష్టం. ఆ సినిమాలో బన్నీ ఉపయోగించిన వాచ్, ధరించిన టీషర్ట్స్, ఆయన స్టైల్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయన మీదున్న అభిమానంతో ఆ స్టైల్‌ను కాపీ చేస్తుంటాను. ఇక కర సినిమా కోసం ధనుష్ ఎంతో కష్టపడ్డాడు. స్టార్ హీరో సూర్యతో కలిసి ప్రధాన పాత్రలో నటించడం గొప్ప అవకాశంగా భావిస్తాను.సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం ఎక్కువైపోయింది. సెలబ్రిటీ అనే కారణంతో నేను అడపాదడపాగా సోషల్‌మీడియాలో ఉండేదాన్ని. ప్రస్తుతం సోషల్‌మీడియాతో వచ్చే పబ్లిసిటీ కంటే మానసిక ప్రశాంతతకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. అది ఆచరణలో పెడుతున్నాను కూడా. ఇక నా సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు మా పీఆర్ టీమ్ అందిస్తారు.ఒక్క సినిమా వెనుక ఎంతోమంది కష్టం దాగుంటుంది. అది ఎప్పుడూ వృథా కాకూడదన్నది నా భావన. జన నాయగన్ లీకైన విషయం తొలుత నమ్మలేదు. సోషల్ మీడియాలో వినిపించేవన్నీ వాస్తవాలు కావని కొట్టిపారేశాను. ఉద్దేశపూర్వకంగా కొందరు ప్రచారం చేస్తున్నారనుకున్నా. కానీ, దురదృష్టవశాత్తు అదే నిజమైంది.

# దుమ్ములేసి పోద్ది చూడు జాతరా



వివేక్ దండు, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'పనసపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్'. గ్రామీణ నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ చిత్రానికి సి.హెచ్.రవికిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని సినిమాలోని తొలిపాట 'మెగాసాంగ్'ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో హీరో మెగా క్రామేడ్స్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కనిపించనున్నారు. ఫ్యాన్స్ చెప్పే స్లోగన్స్ కలబోతగా ఈ పాటను రూపొందించారు. 'బాసుకు దండేసి బొట్టుపెట్టరా, దుమ్ము లేసి పోద్ది చూడు జాతరా' వంటి లైన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్.రాజా, నిర్మాత: పి.వివేకానంద్ వర్మ.

## శ్రీశైల దేవస్థానం అమ్మవారికి లక్కతో కూడిన బంగారు గోపుర కలశం సమర్పణ

**కలశం అందుకున్న ఆలయ పర్యవేక్షకులు హరికృష్ణారెడ్డి, మరియు ఇన్‌స్పెక్టర్, సుబ్బరాయుడు**



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) శ్రీ గురుబసప్ప వారి కుటుంబసభ్యులు, దేవదుర్గ, రాయచూరు, కర్ణాటక వారు లక్కతో కూడిన బంగారు గోపురాన్ని దేవస్థానమునకు సమర్పించారు. ఈ లక్కతో కూడిన గోపుర కలశం బరువు 47 గ్రాములు. అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచనమండపంలో దాతలు ఈ లక్కతో కూడిన బంగారు కలశాన్ని అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు హరికృష్ణారెడ్డి, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ యం. సుబ్బరాయుడు, గుమాస్తా, సావిత్రిలకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో పాటు శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది.

## తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ ముఖ్యుల సమావేశం

- సికింద్రాబాద్ బోయగూడ ముదిరాజ్ భవన్ లో తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం ఆత్మీయ సమ్మేళనం
- హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గా బాపట్ల కృష్ణమోహన్ ముదిరాజ్ మరియు కో కన్వీనర్ గా గడ్డమీద శ్రీశైలం ముదిరాజ్



సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ ముదిరాజు జర్నలిస్టు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చింతల నీలకంఠం, బోయిని శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి 33 జిల్లాల అధ్యక్షులను ఎన్నుకోవడం కొరకు ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలుగా ఉన్నటువంటి 10 జిల్లాల కన్వీనర్లను ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. ఉమ్మడి జిల్లా కన్వీనర్లు గా ఉన్నటువంటి వారు ఉమ్మడి జిల్లాలో ఏ జిల్లా కొత్త జిల్లాలుగా ఏర్పడినావో ఆ జిల్లాలకు అధ్యక్షుల నియామకం జరిగే క్రమంలో వారి బాధ్యతను నిర్వహించడానికి ప్రస్తుతం కన్వీనర్లను నియమించడం జరిగింది.హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గా బాపట్ల కృష్ణమోహన్ ముదిరాజ్, కో కన్వీనర్ గా గడ్డమీద శ్రీశైలం ముదిరాజ్ ను నియమించారు. అలాగే ఉమ్మడి మహబూబ్నగర్ కన్వీనర్ గా జి .నర్సింలు ముదిరాజ్,నారాయణపేట జిల్లా కన్వీనర్ గా నవీన్ ముదిరాజ్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ గా పరమేశ్వర ముదిరాజ్, కో కన్వీనర్ గా బరిగే నర్సింలు ముదిరాజ్,నిర్మల్ జిల్లా కన్వీనర్ గా హనుమాన్లు ముదిరాజ్,సంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా ఏ. రాంబాబు మరియు కో కన్వీనర్ గా గోవర్ధన్ ముదిరాజ్,మెదక్ జిల్లా కన్వీనర్ గా వెంకటేశం ముదిరాజ్,కరీంనగర్ జిల్లా నేదురు సమ్మయ్య ముదిరాజ్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల్ సుమన్ ముదిరాజ్,నల్గొండ జిల్లా కన్వీనర్ గా సైదులు ముదిరాజ్ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాల నుండి వచ్చినటువంటి ముదిరాజులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్ననగర్ లో శ్రావణ బోనాలు ఎమ్మెల్యే శ్రీ గణేష్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢ మాసంలో జరిగే బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించిన తెలంగాణ సర్కార్.తెలంగాడ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలు.అలాగే ఆషాడ బోనాలతో పాటు శ్రావణ మాసంలో కూడా బోనాలు అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళా మణులు అమ్మవారికి బోనం సమర్పిస్తారు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రెండో వార్డులో ఉన్న అన్ననగర్ లో పోచమ్మ ఆలయంలో స్థానికులు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మ వారికి బోనాలు సమర్పించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు తీసుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్. శ్రావణ మాసం బోనాల పండుగ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్న నగర్‌లోని పోచమ్మ దేవాలయం, పెద్దమ్మ దేవాలయాలను దర్శించుకున్నారు.

ఆలయ నిర్వాహకులు,అర్చకులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కి ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన పూజారులు అమ్మవార్ల తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకు అందజేశారు.తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను నియోజకవర్గ ప్రజలందరూ ఆనందోత్సహాలో జరుపుకుంటున్నారని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని,తెలంగాణ ప్రజలపై, ముఖ్యంగా కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఎల్లవేళలా ఉండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ,కాంగ్రెస్ పార్టీ టిపిసిసి సెక్రటరీ రాజేష్ యాదవ్, మురళీ, ఆదిత్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మకు కట్టిన కీర్తి కిరీటం

- ప్రకాశం పంతులు పేరుతో చరిత్రలో చెరగని సంతకం
- 69 ఏళ్లుగా కృష్ణా డెల్టాకు జలజీవనాడి.. 12 లక్షల ఎకరాలకు సాగునీరు.. విజయవాడకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహా నిర్మాణం
- 1954లో శంకుస్థాపన.. 1957లో పూర్తి.. నేటికీ ఆంధ్రుల అభివృద్ధి చరిత్రకు సజీవ సాక్ష్యం



విజయవాడ (ప్రశ్న న్యూస్) కృష్ణమ్మ ఉరకలేస్తుంది.. పరవళ్లు తొక్కుతుంది.. ఎగువ నుంచి వచ్చే వరద జలాలను ఒడిసిపడుతుంది.. ఆ నీటిని కాలువల ద్వారా పంట పొలాలకు చేరవేస్తుంది. విజయవాడకు వచ్చిన ప్రతి ఒక్కరి చూపును ఆకర్షించేలా నదిపై దర్జాగా నిలిచిన ఆ నిర్మాణం కేవలం



కాంక్రీట్ కట్టడం కాదు. అది ఆంధ్రప్రదేశ్ సాగునీటి చరిత్రలో ఓ అధ్యాయం. రైతు జీవితాల్లో పచ్చదనానికి ప్రతీక. విజయవాడకు చిరునామా. ఆంధ్రుల అభివృద్ధి ఆకాంక్షలకు ప్రతిబింబం. అదే ప్రకాశం బ్యారేజీ.ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో వెలుగొందుతున్న ఈ బ్యారేజీ నిర్మాణానికి 1954 ఫిబ్రవరి 13న శంకుస్థాపన జరిగింది. 1957 డిసెంబర్ 24న నిర్మాణం పూర్తయింది. దాదాపు మూడున్నరేళ్లలోనే పూర్తయిన ఈ భారీ నిర్మాణం అప్పటి ఇంజినీరింగ్ సామర్థ్యానికి అద్దం పట్టింది. నేటితో 69 ఏళ్ల చరిత్రను పూర్తి చేసుకున్న ఈ జలకట్ట.. కాలం మారినా తన ప్రాధాన్యాన్ని కోల్పోకుండా నిలిచింది.

### అది బ్యారేజీ కాదు.. రైతు భరోసా!

కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని సుమారు 12 లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలన్న మహత్తర లక్ష్యంతో ప్రకాశం బ్యారేజీ నిర్మించబడింది. కృష్ణాజలాలను నియంత్రించి కాలువలకు మళ్లించడం ద్వారా కృష్ణా డెల్టా వ్యవసాయానికి ఇది వెన్నెముకగా మారింది.వర్షాల కోసం ఆకాశం వైపు చూసే రైతుకు.. కృష్ణమ్మ నీరు ఒక నమ్మకం. పంట పొలాల్లో పచ్చదనం కనిపించడానికి సాగునీరు ఒక ప్రాణాధారం. ఆ ప్రాణాధారాన్ని అందించే జలవనరుల వ్యవస్థలో ప్రకాశం బ్యారేజీకి ప్రత్యేక స్థానం ఉంది.ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రహదారులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు ఎంత అవసరమో.. వ్యవసాయ ఆధారిత ప్రాంతానికి నీటి వనరులు అంతకంటే ముఖ్యమైనవి. ఆ బాధ్యతను ప్రకాశం బ్యారేజీ దశాబ్దాలుగా నిర్వర్తిస్తోంది.

### బ్రిటిష్ కాలంలోనే ఆలోచన..

కృష్ణానదిపై విజయవాడ వద్ద సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలన్న ఆలోచన నిన్న మొన్నటిది కాదు. బ్రిటిష్ పాలన కాలంలోనే ఈ ప్రాంతంలో కృష్ణాజలాల వినియోగంపై ఆలోచనలు మొదలయ్యాయి. చారిత్రక వివరాల ప్రకారం 1798లో కెప్టెన్ బకిల్ కృష్ణానదిపై జలవనరుల వినియోగం, సాగునీటి అవసరాలపై ప్రాజెక్టు ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. అనంతరం సర్ ఆర్థర్ కాటన్ చొరవతో విజయవాడ వద్ద కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. 1855లో పాత ఆనకట్ట నిర్మాణం పూర్తయింది. అది అప్పటి కాలానికి ఒక గొప్ప ఇంజినీరింగ్ ప్రయత్నం. అయితే కాలక్రమేణా సాగునీటి అవసరాలు పెరిగాయి. పాత నిర్మాణం స్థానంలో మరింత సామర్థ్యం కలిగిన ఆధునిక జలకట్ట అవసరమైంది. ఆ అవసరమే ప్రస్తుత ప్రకాశం బ్యారేజీ నిర్మాణానికి దారితీసింది.

### 1954 ఫిబ్రవరి 13.. చరిత్రలో మరో మలుపు



ప్రస్తుత ప్రకాశం బ్యారేజీ నిర్మాణానికి 1954 ఫిబ్రవరి 13న శంకుస్థాపన జరిగింది. ఆ సమయంలో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత భారీ స్థాయిలో పనులు సాగాయి. నదీ ప్రవాహం, భౌగోళిక పరిస్థితులు, నిర్మాణ సాంకేతికత వంటి అనేక సవాళ్లను అధిగమిస్తూ పనులు కొనసాగాయి.చివరకు 1957 డిసెంబర్ 24న నిర్మాణం పూర్తయింది. కేవలం మూడున్నరేళ్ల వ్యవధిలో ఇంతటి భారీ జల నిర్మాణాన్ని పూర్తి చేయడం అప్పటి కాలానికి అసాధారణమైన ఘనతగా చెప్పుకోవచ్చు.

### రూ.2.78 కోట్లతో.. అప్పట్లోనే భారీ నిర్మాణం

ప్రకాశం బ్యారేజీ నిర్మాణానికి అప్పటి కాలంలో సుమారు రూ.2.78 కోట్లు వ్యయం అయినట్లు చారిత్రక వివరాలు పేర్కొంటున్నాయి.

నేటి విలువలతో పోలిస్తే ఆ మొత్తం చిన్నదిగా కనిపించవచ్చు. కానీ ఆ రోజుల్లో రూ.2.78 కోట్లు అంటే భారీ పెట్టుబడి. ప్రజల భవిష్యత్తు, రైతుల ప్రయోజనం, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ఈ నిర్మాణం తర్వాతి తరాలకు అపారమైన ప్రయోజనాన్ని అందించింది.

### 1,223 మీటర్ల జలకట్ట!

ప్రకాశం బ్యారేజీ పొడవు సుమారు 1,223 మీటర్లు. అంటే ఒక కిలోమీటరుకు పైగా విస్తరించిన ఈ నిర్మాణంలో మొత్తం 76 ఖానాలు ఉన్నాయి.

వాటిలో 70 ఖానాలు గుంటూరు జిల్లా వైపు, మిగిలిన ఆరు ఖానాలు కృష్ణా జిల్లా వైపు ఉన్నట్లు వివరాలు చెబుతున్నాయి.

కృష్ణానది ప్రవాహాన్ని నియంత్రించడం, నీటిని నిల్వ చేయడం, కాలువలకు మళ్లించడం వంటి కీలక బాధ్యతలను ఈ నిర్మాణం నిర్వర్తిస్తోంది. అందుకే ఇది కేవలం విజయవాడకు సంబంధించిన నిర్మాణం కాకుండా.. విస్తృత కృష్ణా డెల్టా ప్రాంతానికి జీవనాడిగా గుర్తింపు పొందింది.

### పేరు పెట్టడంలోనూ ఓ చరిత్ర!

ప్రకాశం బ్యారేజీకి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు పెట్టడం వెనుక ఆయన ప్రజా సేవకు ఉన్న గుర్తింపే ప్రధాన కారణం. న్యాయవాదిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజానాయకుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి.

ప్రజల హక్కుల కోసం నిర్భయంగా పోరాడిన ఆయనను ప్రజలు లిలి'ఆంధ్ర కేసరి'లిలిగా గౌరవించారు. అలాంటి మహానేత పేరును లక్షలాది రైతులకు జీవనాధారంగా నిలిచిన ఈ మహా జల నిర్మాణానికి పెట్టడం ద్వారా ఆయన సేవలను తరతరాలకు గుర్తు చేసేలా చేశారు.

అందుకే విజయవాడ అంటే ప్రకాశం బ్యారేజీ.. ప్రకాశం బ్యారేజీ అంటే టంగుటూరి ప్రకాశం పంతులు.. అన్నంతగా ఈ రెండు పేర్లు ప్రజల మదిలో విడదీయరాని బంధంగా మారాయి.

### విజయవాడకు ఓ ప్రత్యేక గుర్తింపు

ప్రకాశం బ్యారేజీ కేవలం సాగునీటి అవసరాలను తీర్చడమే కాదు.. విజయవాడ నగరానికి ఓ ప్రత్యేక దృశ్యరూపాన్ని ఇచ్చింది. కృష్ణానదిపై విస్తరించిన ఈ బ్యారేజీని చూసేందుకు వచ్చే సందర్శకులు నగరానికి మరో కోణాన్ని ఆస్వాదిస్తారు. ఒక వైపు కృష్ణమ్మ.. మరోవైపు విజయవాడ నగరం.. మధ్యలో చరిత్రను మోస్తూ నిలిచిన ప్రకాశం బ్యారేజీ. ఉదయం సూర్యకిరణాల్లోనూ.. సాయంత్రం వెలుగుల్లోనూ.. కృష్ణమ్మ పరవళ్ల మధ్యనూ ఇది నగరానికి ప్రత్యేక అందాన్ని అందిస్తోంది.

### వరదల సమయంలోనూ కీలక పాత్ర

కృష్ణానదికి భారీ వరదలు వచ్చిన సందర్భాల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించడం అత్యంత కీలకం. ఇలాంటి సమయాల్లో ప్రకాశం బ్యారేజీ వ్యవస్థకు ఉన్న ప్రాధాన్యం మరింత స్పష్టమవుతుంది.

నదీ ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ నీటిని దిగువకు విడుదల చేయడం, అందుబాటులో ఉన్న జలాలను సాగునీటి అవసరాలకు వినియోగించడం వంటి అంశాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ప్రకాశం బ్యారేజీకి కూడా పరిమితులు ఉన్నాయి. భారీ వరదలు వచ్చినప్పుడు నదీ ప్రవాహం ఉద్ధృతంగా మారుతుంది. అలాంటి సందర్భాల్లో బ్యారేజీ భద్రత, నిర్వహణ, గేట్ల సామర్థ్యం, నదీ ప్రవాహ పర్యవేక్షణ వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యమైనవిగా మారుతున్నాయి.

### 69 ఏళ్లలో ఎన్నో తరాలకు సాక్ష్యం

1954లో నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ప్రకాశం బ్యారేజీ ఎన్నో తరాల జీవితాలను చూసింది. రైతుల పంటలను చూసింది. కృష్ణమ్మ వరదలను చూసింది. కరువు కాలాలను చూసింది. విజయవాడ నగరం విస్తరిస్తున్న దృశ్యాన్ని చూసింది. రాజకీయ మార్పులను చూసింది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడాన్ని చూసింది.

**కానీ దాని అసలు లక్ష్యం మాత్రం మారలేదు.**

**నీటిని ఒడిసిపట్టి.. రైతు పొలానికి చేర్చడం!**

**అదే ప్రకాశం బ్యారేజీ అసలు స్ఫూర్తి.**

**కృష్ణమ్మకు కట్టిన కీర్తి కిరీటం**

ఏడాదులు గడుస్తున్న కొద్దీ కొన్ని నిర్మాణాలు శిథిలాలుగా మారతాయి. మరికొన్ని కేవలం చరిత్ర పుస్తకాలలో మిగిలిపోతాయి. కానీ ప్రజల జీవితాలతో ముడిపడిన నిర్మాణాలు మాత్రం తరాలు మారినా సజీవంగానే ఉంటాయి

### ప్రకాశం బ్యారేజీ కూడా అలాంటి నిర్మాణమే.

ఇది కేవలం రాళ్లు, సిమెంటు, ఇనుముతో నిర్మించిన జలకట్ట కాదు. లక్షలాది రైతుల ఆశలు, కోట్లాది ప్రజల అవసరాలు, దశాబ్దాల ఆంధ్ర అభివృద్ధి చరిత్రను మోస్తున్న ప్రజా ఆస్తి.

ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా ఆయన పేరుతో ఉన్న ఈ బ్యారేజీని స్మరించుకోవడం అంటే ఒక మహానేతను మాత్రమే గుర్తు చేసుకోవడం కాదు. ఆంధ్రప్రదేశ్ సాగునీటి చరిత్రను, కృష్ణా డెల్టా రైతాంగాన్ని, నీటి విలువను, అభివృద్ధి కోసం గత తరాలు చేసిన కృషిని స్మరించుకోవడమే.

కృష్ణమ్మ ప్రవహించినంతకాలం.. ప్రకాశం బ్యారేజీ కథ కొనసాగుతూనే ఉంటుంది.

రైతు పొలంలో పచ్చదనం ఉన్నంతకాలం.. ఈ జలకట్ట ప్రాధాన్యం నిలిచే ఉంటుంది.

టంగుటూరి ప్రకాశం పేరు చరిత్రలో ఉన్నంతకాలం.. ఆయన పేరుతో వెలుగొందుతున్న ప్రకాశం బ్యారేజీ కూడా ఆంధ్రుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**రచయిత:**

మేకల మోహనరావు

MA (Political Science), MA (Public Administration), M.Phil

ఫౌండర్ చైర్మన్ & ప్రిన్సిపాల్

# బ్రేకులు ఫెయిల్.. లోయలోకి పోలీసు వాహనం

- విధి నిర్వహణలో విషాదం.. కానిస్టేబుల్ మృతి - ఎస్సై సహా ముగ్గురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎస్పీ దామోదర్





విజయనగరం(ప్రశ్న న్యూస్) విధి నిర్వహణకు వెళ్లిన పోలీసు సిబ్బందిని తిరిగి తీసుకొస్తున్న వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి లోయలో పడటంతో విషాదం చోటుచేసుకుంది. బ్రేకులు ఫెయిల్ కావడంతో వాహనం రహదారి పక్కన ఉన్న సుమారు 20 అడుగుల లోతైన గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ సీర వెంకట రమణ (49) మృతి చెందారు. ఎస్సైతో పాటు మరో ఇద్దరు పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరం మండలం కొండకరకాం గ్రామానికి ఆగస్టు 23న విచారణ నిమిత్తం వెళ్లిన విజయనగరం రూరల్ ఎస్సై, పోలీసు సిబ్బంది తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్పీ ఎఆర్ దామోదర్, తెలిపారు.విచారణ పూర్తి చేసుకుని పోలీసులు తిరిగి వస్తుండగా వాహనం బ్రేకులు పనిచేయకపోవడంతో అదుపుతప్పింది. రహదారి పక్కనున్న లోయలోకి దూసుకెళ్లి పడిపోయింది. ప్రమాద తీవ్రతకు వాహనంలో ఉన్న పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ సీర వెంకట రమణను తొలుత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసరంగా చికిత్స అందించినప్పటికీ వెంకట రమణ మృతి చెందారు. విధి నిర్వహణలో తమతో కలిసి పనిచేసిన సహచరుడిని కోల్పోవడంతో జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ భావోద్వేగానికి గురయ్యారు. పోలీసు కుటుంబంలోని ఓ మంచి వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ వెంకట రమణ కుటుంబానికి అండగా నిలుస్తామని అధికారులు భరోసా ఇవ్వడంతో పాటు, గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

# తిరుపతి హోటల్లో తింటే ఆసుపత్రికి పక్కా

## -ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు శాపం

- భక్తుల కడుపుతో చెలగాటం.. హోటళ్లలో కుళ్లిన కూరగాయలు, మిగిలిన ఆహారమే
- 500 కిలోల పాడైన ఆహారం స్వాధీనం.. పంజాబీ డాబా సహా పలు హోటళ్లు సీజ్
- ఫ్రిజ్‌లలో కుళ్లిన కూరగాయలు.. వంటగదుల్లో కుక్కలు, పిల్లులు
- బ్రహ్మోత్సవాల వేళ అప్రమత్తం.. నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్సుల రద్దు
- ఒక్కసారి దాడితో సరిపోదు ప్రతినెల దాడులు చేయాల్సిందే భక్తుల డిమాండ్







తిరుపతి (ప్రశ్న న్యూస్) శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నం పెడుతున్నామా.. అనారోగ్యాన్ని పంచుతున్నామా? అన్న సందేహం కలిగించేలా తిరుపతి నగరంలోని కొన్ని హోటళ్ల నిర్వహణ తీరుపై మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో తీవ్ర లోపాలు వెలుగుచూశాయి. కుళ్లిపోయిన ఆలుగడ్డలు.. పాడైన క్యాబేజీ.. కాలీఫ్లవర్.. వండి మిగిలిపోయిన ఆహారం.. సరైన ఉష్ణోగ్రత లేకుండా ఫ్రిజ్‌లలో నిల్వలు.. వంటగదుల్లో కుక్కలు, పిల్లుల సంచారం.. మురుగునీరు, వ్యర్థాలతో దుర్వాసన.. ఇవన్నీ ఒకే తనిఖీలో బయటపడటం ఆహార భద్రతపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ప్రజలకు, ముఖ్యంగా దేశం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నాణ్యమైన ఆహారం అందాల్సిన తిరుపతిలోనే ఇలాంటి పరిస్థితులు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు ముందుగా కపిలతీర్థం సమీపంలోని ఏ2బీ హోటల్‌ను తనిఖీ చేశారు. అక్కడ సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు.




నిర్వహించిన తనిఖీల్లో సుమారు 500 కిలోల పాడైన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

### భక్తుల కడుపుతో ఆటలేనా.?

తిరుపతి సాధారణ నగరం కాదు. దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు శ్రీవారి దర్శనం కోసం నగరానికి వస్తుంటారు. సమయాభావంతో చాలామంది హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో భోజనం చేస్తుంటారు.
అలాంటి భక్తులకు "ఏది దొరికితే అది పెట్టడం.. పాడైందో లేదో చూడకుండా వడ్డించడం.." వంటి ధోరణి ఉంటే దాని ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఒక భక్తుడికి కలుషిత ఆహారం అందితే అది అతని ఆరోగ్యానికే కాదు.. తిరుపతి నగర ప్రతిష్ఠకూ నష్టం. అందుకే ఆహార నాణ్యత విషయంలో అధికారులు తీసుకున్న చర్యలను మరింత కఠినంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

### ఏ2బీ హోటల్‌లో పారిశుధ్య గందరగోళం

తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ, ఐఏఎస్ ఆదేశాల మేరకు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

హోటల్ కాలువల్లో వ్యర్థాలను విచ్చలవిడిగా వేయడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. హోటల్ నుంచి వెలువడే వ్యర్థాల కారణంగా మున్సిపల్ డ్రైనేజీ కూడా బ్లాక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించారు.
ఇక ఆహార పదార్థాలను నిల్వ చేసే ఫ్రిజ్ తుప్పుపట్టి ఉండటం కూడా తనిఖీల్లో బయటపడింది. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ చట్టం--1955 ప్రకారం పెనాల్టీ విధించి నోటీసులు జారీ చేశారు.

### ఫ్రిజ్ తెరిస్తే.. కుళ్లిన కూరగాయలే

రైల్వే స్టేషన్ ఎదుట, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లోని హోటళ్లపై అధికారులు దృష్టి సారించగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపించింది.
పలు హోటళ్లలో కుళ్లిపోయిన ఆలుగడ్డలు, క్యాబేజీ, కాలీఫ్లవర్ గుర్తించారు. వండి మిగిలిపోయిన ఆహార పదార్థాలను కూడా సరైన ఉష్ణోగ్రత పాటించకుండా ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు.
పాడైన ఆహారం బయటకు పారేయాల్సింది పోయి.. దానిని నిల్వ ఉంచి వినియోగించే ప్రయత్నం చేయడం ప్రజల ఆరోగ్యంపై ఎంతటి నిర్లక్ష్యమో అధికారుల తనిఖీల్లో స్పష్టమైంది.
"పాడైన పదార్థాలతో వంట చేసి ప్రజలకు వడ్డిస్తే ఎలా?" అన్న ప్రశ్న ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

### వంటగదిలో కుక్కలు.. పిల్లులు

ఆహారం తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలి. ఆహార పదార్థాల దగ్గరకు జంతువులు రాకుండా చర్యలు తీసుకోవాలి. కానీ కొన్ని



హోటళ్లలో కుక్కలు, పిల్లులు సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇది కేవలం అపరిశుభ్రతకు సంబంధించిన అంశం కాదు.. ఆహార కలుషితానికి కూడా కారణమయ్యే ప్రమాదకర పరిస్థితి. ఆహార తయారీ ప్రదేశాల్లో జంతువులు తిరుగుతుంటే అక్కడ తయారయ్యే ఆహారం ఎంతవరకు సురక్షితం? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

### 500 కిలోల పాడైన ఆహారం

తనిఖీల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న పాడైన ఆహార పదార్థాల పరిమాణం సుమారు 500 కిలోలు.
ఈ ఒక్క సంఖ్యే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పడానికి చాలు. ఒకటి రెండు హోటళ్లలో చిన్నచిన్న లోపాలు కాకుండా.. పలు చోట్ల ఆహార నిల్వ, పారిశుధ్య నిర్వహణ, నాణ్యత ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.
ప్రజల ఆరోగ్యంతో సంబంధం ఉన్న అంశంలో ఇంత నిర్లక్ష్యం కొనసాగితే.. చిన్న సమస్య కూడా పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### పంజాబీ డాబాకు తాళం

రైల్వే స్టేషన్ ప్రాంతంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా పాటించని పంజాబీ డాబాతో పాటు పలు ఫాస్ట్‌ఫుడ్ హోటళ్లను అధికారులు సీజ్ చేశారు.మరో నాలుగు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసులు నమోదు చేశారు.మిగిలిన హోటళ్లకు లోపాలను వెంటనే సరిచేసుకోవాలని నోటీసులు జారీ చేసి పెనాల్టీలు విధించారు.

### మరో నోటీసు ఉండదు.. నేరుగా సీజ్

ఇకపై నిబంధనల ఉల్లంఘనకు అవకాశం ఇవ్వబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను అధికారులు ఇచ్చిన గడువులోపు సరిచేయాలి.గడువు ముగిసినా లోపాలు అలాగే ఉంటే మరో నోటీసు ఇవ్వకుండానే హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.పదేపదే నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసే దిశగా కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### బ్రహ్మోత్సవాల వేళ.. మరింత అప్రమత్తత అవసరం

త్వరలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆ సమయంలో తిరుపతికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది.
భక్తుల రద్దీ పెరిగిన సమయంలో హోటళ్లలో డిమాండ్ కూడా పెరుగుతుంది. ఈ సమయంలోనే కొందరు వ్యాపారులు నాణ్యతను పక్కన పెట్టి వేగంగా ఆహారం తయారు చేసి విక్రయించే అవకాశం ఉంటుంది. అందుకే బ్రహ్మోత్సవాల సమయంలోనే కాకుండా ముందుగానే హోటళ్లపై తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉంది. ముడిసరుకు నాణ్యత నుంచి వంటగది పరిశుభ్రత వరకు.. ఆహార నిల్వ నుంచి వడ్డించే విధానం వరకు ప్రతి అంశాన్ని అధికారులు పరిశీలించాలి.

### మంచి సరుకు.. మంచి నూనె.. పరిశుభ్రమైన వంటగది

హోటల్ వ్యాపారం అంటే కేవలం లాభం కోసం ఆహారం విక్రయించడం కాదు. ప్రజల ఆరోగ్యానికి బాధ్యత వహించాల్సిన సేవ కూడా.
అందుకే వంటకు నాణ్యమైన ముడిసరుకులు, కల్తీ లేని నూనెలు ఉపయోగించాలని అధికారులు ఆదేశించారు. వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలని, వండిన ఆహారాన్ని సరైన పద్ధతిలో భద్రపరచాలని సూచించారు.
పాడైన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు.

### ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు

హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ మాట్లాడుతూ నగరంలోని హోటళ్లలో ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను మాత్రమే అందించాలని స్పష్టం చేశారు.
ప్రజలకు, యాత్రికులకు అనారోగ్యకరమైన ఆహారం అందిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుర్తించిన లోపాలను వెంటనే



సరిచేసుకోవాలని, నిబంధనలు పాటించని హోటళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### లైసెన్స్ రద్దు దిశగా చర్యలు

ఆహార నాణ్యత విషయంలో పదేపదే నిర్లక్ష్యం చేసే హోటళ్లపై కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసే స్థాయిలో చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.
మున్సిపల్ కార్పొరేషన్ చట్టం--1955 ప్రకారం అవసరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.
ఇకపై నగరంలోని అన్ని హోటళ్లలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### తనిఖీలు ఒక్కరోజుకే పరిమితం కాకూడదు

తాజా తనిఖీల్లో భారీగా పాడైన ఆహార పదార్థాలు బయటపడటంతో.. తనిఖీలు కేవలం ఒకరోజు కార్యక్రమంగా మిగిలిపోకూడదన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.తిరుపతిలో వేలాది హోటళ్లు, చిన్నచిన్న తినుబండార కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి ప్రాంతంలోనూ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన రహదారులు, యాత్రికుల రద్దీ ఉండే ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ అవసరం.

### భక్తుడి విశ్వాసాన్ని కాపాడాలి

తిరుపతికి వచ్చే భక్తుడు కేవలం ఆహారం కోసం హోటల్‌లోకి అడుగుపెట్టడు. "ఇక్కడ దొరికే ఆహారం సురక్షితమే" అన్న నమ్మకంతో తింటాడు. ఆ నమ్మకాన్ని వ్యాపారులు దుర్వినియోగం చేయకూడదు.
భక్తుల ఆరోగ్యంతో చెలగాటమాడే ఏ హోటల్ యాజమాన్యాన్నీ ఉపేక్షించకూడదు. అదే సమయంలో నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందించే హోటళ్లను ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉంది.

### కఠిన చర్యలే శాశ్వత పరిష్కారం

కుళ్లిన కూరగాయలు.. పాడైన ఆహారం.. మురుగునీటితో నిండిన కాలువలు.. తుప్పుపట్టిన ఫ్రిజ్‌లు.. వంటగదుల్లో కుక్కలు, పిల్లులు.. ఇవన్నీ కేవలం హోటల్ లోపాలు కావు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే అంశాలు.అందుకే అధికారులు ఇప్పుడు హెచ్చరికలు జారీ చేయడంతో ఆగకుండా.. తనిఖీలను నిరంతరం కొనసాగించాలి. తప్పు చేసిన వారికి జరిమానాలు మాత్రమే కాకుండా, అవసరమైతే సీజ్, లైసెన్స్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకోవాలి.శ్రీవారి భక్తులకు అన్నం పెట్టే హోటల్.. అనారోగ్యాన్ని పెట్టే కేంద్రంగా మారకూడదు. తిరుపతి పేరు చెప్పగానే భక్తికి గుర్తొచ్చే నగరం.. కలుషిత ఆహారానికి గుర్తుగా మారకూడదు."ఆరోగ్యకరమైన ఆహారం అందించండి.. లేదంటే కఠిన చర్యలు తప్పవు" అన్న హెల్త్ ఆఫీసర్ హెచ్చరికలు ఇక మాటల్లో కాకుండా.. నిరంతర తనిఖీలు, కఠిన అమలు ద్వారా కనిపించాల్సిన అవసరం ఉంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588